విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

ప్రశ్నించడం అందరి హక్కు...

# పెన్ సత్తా

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక : 51 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | మంగళవారం 14 జూలై 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం డెడ్‌లాక్ అయ్యిందా?




- పీయూష్ గోయల్ ఇచ్చిన క్లారిటీ ఇదే!
- "అవన్నీ అవాస్తవం, నిరాధారం, తప్పుదోవ పట్టించే వార్తలు"
- భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై ప్రతిష్టంభన ఏర్పడిందనే వార్తలను ఖండించిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



# ఫాస్ట్ ట్రాక్‌లో పోలవరం పనులు

- ఆగస్టు 14 న అనకాపల్లికి గోదావరి జలాలు.
- సెప్టెంబరు 1 తేదీన వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం.
- రాష్ట్ర వ్యాప్తంగా 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులు వేగంగా పూర్తి.
- జలధార-జలహారతి పనులకు ప్రతీ జిల్లాకు రూ.2 కోట్లు మంజూరు.
- పోలవరం ప్రాజెక్టు పరిశీలన, అధికారులతో సమీక్షించిన సీఎం.




పోలవరం, జూలై 13: ఈ ఏడాది ఆగస్టు 14 తేదీన అనకాపల్లిలో గోదావరి జలాలకు అఖండ హారతి ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ముందు అనకాపల్లి వరకూ పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటిని తరలించనున్నట్టు సీఎం తెలియచేశారు. వచ్చే ఏడాది లోగా విశాఖకు నీటిని తరలించే ప్రక్రియలో భాగంగా ఈ కార్యక్రమం చేపడతామని అన్నారు. పోలవరం ప్రాజెక్టును మార్చి 2027 నాటికల్లా పూర్తి చేస్తామని, వర్షపు సీజన్ సహా వరద నీటి ప్రవాహాలకు అనుగుణంగా జూలైలో గ్రావిటీ పై నీటిని విడుదల చేయనున్నట్టు తెలిపారు. ధవళేశ్వరం ప్రాజెక్టుకు కొత్త గేట్లను అమర్చే పనుల్ని ప్రారంభించిన అనంతరం సీఎం పోలవరం ప్రాజెక్టుకు చేరుకున్నారు. హెలికాప్టర్ నుంచి ప్రాజెక్టు పనుల్ని విహంగ వీక్షణం ద్వారా పరిశీలించిన ముఖ్యమంత్రి.. అధికారులతో సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తిచేసి రాష్ట్ర ప్రజల దశాబ్దాల కలను సాకారం చేస్తామని అన్నారు. పోలవరం ఎడమ కాలువకు గోదావరి జలాలను విడుదల చేసి ఆగస్టు 14 న అనకాపల్లి జిల్లాలో గోదావరి జలాలకు స్వాగతం పలికి అఖండ హారతి ఇస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని ప్రతీ నెలా ప్రజలకు వివరిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, విశాఖపట్నం,

వివరాలు 2లో..

# ఏపీలో ముగింపు దశకు ఓటర్ల జాబితా సవరణ



- గడువు పొడిగించాలని ఈసీకి సీఈవో లేఖ
- రాష్ట్రంలో పూర్తయిన 88 శాతం ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ
- చనిపోయినట్లుగా 14 లక్షల మందికి పైగా ఓటర్ల గుర్తింపు
- శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు 12 లక్షలకు పైనే

**హైదరాబాద్**

రాష్ట్రంలో ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. గత నెల రోజుల నుంచి జరుగుతున్న ఈ ప్రక్రియలో గణనీయమైన పురోగతి కనిపించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 88 శాతం ఓటర్ల డిజిటలైజేషన్ పూర్తయినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) వివేక్ యాదవ్ స్పష్టం చేశారు. అయితే, వివిధ రాజకీయ పార్టీల వినతుల మేరకు ఈ ప్రక్రియ గడువును మరికొన్ని రోజులు పొడిగించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో నెల రోజుల నుంచి బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ)

వివరాలు 2లో..



## ఒమర్ అబ్దుల్లాకు బీజేపీ షాక్..

- రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసు!
- ఎమ్మెల్యేల కొనుగోలుకు బీజేపీ యత్నించిందని ఒమర్ ఆరోపణ
- ఏడు రోజుల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని నోటీసులో బీజేపీ డిమాండ్
- లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరిక
- ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేసిన కాషాయదళం




## ప్రపంచ నేతలే లక్ష్యంగా ఇరాన్ హిట్‌లిస్ట్?

- జాబితాలో ట్రంప్, మెలోనీ, మెక్రాన్ పేర్లు!
- అమెరికా, యూరప్ నేతలే లక్ష్యంగా హిట్‌లిస్ట్ ప్రచురించిన ఇరాన్ పత్రిక
- అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారంగానే ఈ జాబితా అంటూ ప్రకటన
- ప్రతీకారం తీర్చుకుంటామని, నేరస్థుల జాబితా సిద్ధంగా ఉందని మొజ్తబా ఖమేనీ హెచ్చరిక
- జాబితాలో ట్రంప్, నెతన్యాహు, మెక్రాన్ సహా 13 మంది ప్రముఖులు

# చిన్నారుల కేంద్రాలకు కొత్త చిగురు

- కొత్తగా అందుబాటులోకి రానున్న 4,794 అంగన్వాడీ భవనాలు
- వైఎస్సార్సీపీ నిర్లక్ష్యంతో వివిధ దశల్లో ఆగిపోయిన నిర్మాణ పనులు
- అవసరమైన నిధులు విడుదల చేయాలని సీఎం ఆదేశం
- కొత్తగా 1864 భవనాలు చేపట్టేందుకు ప్రభుత్వం ఆమోదం



**అమరావతి**

రాజకీయ కారణాలతో నిలిచిపోయిన అంగన్వాడీ కేంద్రాలకు కూటమి ప్రభుత్వం ఊపిరి పోయనుంది. అభివృద్ధియే ముఖ్యమంటూ ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది. టీడీపీ ప్రభుత్వం చేపట్టిందనే కక్షతో 2019-24 మధ్య జగన్ నిలిపేసిన 2,930 అంగన్వాడీ కేంద్రాల నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం పూర్తి చేయాలని నిర్ణయించింది. దీనికి వీబీ జీరామ్ జీ పథకాన్ని అనుసంధానిస్తారు. వీటితోపాటు కొత్తగా 1,864 భవనాలను నిర్మిస్తారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారు. వీటికి అవసరమైన నిధులను విడుదల చేయాలని ఆర్థికశాఖ అధికారులను ఆదేశించారు. ఇవి పూర్తయితే 4,794 భవనాలు కొత్తగా సమకూరుతాయి. రాష్ట్రవ్యాప్తంగా 55,754 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, అందులో 23,407 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. విడతల వారీగా శాశ్వత

వివరాలు 2లో..

## పేరుకుపోయిన చెత్తని 10 రోజుల్లో తొలగించండి

అధికారులకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ ఆదేశాలు



**విజయవాడ**

ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐఏఎల్ఏ) పరిధిలోని విజయవాడ ఆటో నగర్ ప్రాంతంలో 'చెత్త సేకరణ, బదిలీ కేంద్రం' (గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్) ఏర్పాటుకు అనువైన ఖాళీ స్థలాన్ని గుర్తించాలని ఏపీఐఐసీ, ఐఏఎల్ఏ అధికారులను స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆదేశించారు. ఈ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన సమగ్ర లేఅవుట్ ప్లాన్, ఇంజనీరింగ్ డిజైన్, అంచనా వ్యయం, ఇతర ప్రాజెక్ట్ పత్రాల తయారీకి సాంకేతిక సహాయం కోరుతూ ఏపీఐఐసీ సంస్థ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్‌కు ప్రతిపాదన పంపాలని చెప్పారు. విజయవాడ ఆటోనగర్ లోని ఏపీఐఐసీ జోనల్ కార్యాలయంలో మున్సిపల్ ఘన వ్యర్థాల నిర్వహణపై సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటోనగర్ లో పేరుకుపోయిన చెత్త తొలగించేందుకు తక్షణ చర్యలు

వివరాలు 2లో..



## ఇక హర్మ్యూజ్ జలసంధిని మేమే నడిపిస్తాం..

- కానీ మాకు డబ్బులివ్వాలి: ట్రంప్
- హర్మ్యూజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటున్నామన్న ట్రంప్
- ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇరాన్ డ్రోన్లు పంపుతోందని ఆరోపణ
- ఇరాన్‌పై రాత్రి సైనిక దాడులు చేశామని వెల్లడి
- జలసంధి భద్రతకు ఇతర దేశాలు డబ్బు చెల్లించాలని డిమాండ్



## 'ఎస్-500' వచ్చేస్తోంది!

- భారత్‌కు రష్యా బంపర్ ఆఫర్..
- ఇక చైనా, పాకిస్తాన్‌కు చుక్కలే..!
- భారతదేశ రక్షణ రంగాన్ని మరింత పటిష్టం చేసే దిశగా ఒక కీలక పరిణామం
- దేశీయంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ప్రాజెక్ట్ సుదర్శన్ చక్ర'



## ప్రేమలో ఉన్న అమ్మాయి, అబ్బాయి పారిపోకుండా ప్రభుత్వం ఎలా ఆపగలదు?

- పోక్సో దుర్వినియోగంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- ప్రేమలో ఉన్న టీనేజీ యువతపై పోక్సో చట్టం దుర్వినియోగం అవుతుందని సుప్రీంకోర్టు ఆందోళన
- ఆ జంట పారిపోకుండా ప్రభుత్వం ఎలా ఆపగలదని ప్రశ్న
- కుటుంబ పరువు కోసం తల్లిదండ్రులు కేసులు పెడుతున్నారని వ్యాఖ్య

# ఏజెన్సీ ప్రాంతాలపై జనసేన కన్ను



**విశాఖపట్టణం :** ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఏజెన్సీ ప్రాంతాలపై అధికార కూటమి ప్రత్యేక దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత ఎన్నికల ఫలితాలను విశ్లేషించిన తర్వాత గిరిజన నియోజకవర్గాల్లో పార్టీ బలాన్ని మరింత పెంచాలని ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని చెబుతున్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ బాధ్యతలో కీలక పాత్రను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు అప్పగించినట్లు ప్రచారం జరుగుతోంది.ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రామీణాభి వృద్ధి, పంచాయతీరాజ్ శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్ ఇటీవల ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నారని సమాచారం. రహదారులు, తాగునీరు, విద్యుత్, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెబుతున్నారుప్రత్యేకించి ఎన్నో దశాబ్దాలుగా సరైన రోడ్డు సౌకర్యం లేని గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలుస్తోంది. "అడవి తల్లి బాట" వంటి కార్యక్రమాల ద్వారా మారుమూల ప్రాంతాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేసే పనులు వేగవంతం చేసినట్లు అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ చర్యలతో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధిపై ప్రజల్లో సానుకూల స్పందన పెరుగుతుందని కూటమి నాయకులు భావిస్తున్నారు.అభివృద్ధితో పాటు గిరిజనులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు సమాచారం. ముఖ్యంగా అడవి ప్రాంతాల్లో ఏనుగుల సంచారం వల్ల పంటలు, ఆస్తులకు కలుగుతున్న నష్టాన్ని తగ్గించే చర్యలు, విద్యుత్ సౌకర్యాల విస్తరణ, గ్రామీణ కనెక్టివిటీ పెంపు వంటి అంశాలపై సంబంధిత శాఖలు పనిచేస్తున్నాయని చెబుతున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రజలతో మరింత సన్నిహిత సంబంధాలు ఏర్పడతాయని అధికార పార్టీ అంచనా వేస్తోంది.రాజకీయంగా పరిశీలిస్తే, 2009 నుంచి ఏజెన్సీ నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభావం ఎక్కువగా కొనసాగిందని ఎన్నికల ఫలితాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. 2024 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కూటమి మంచి ఫలితాలు సాధించినప్పటికీ, అరకు పార్లమెంట్ స్థానం మాత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఖాతాలోకి వెళ్లడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వచ్చే ఎన్నికల నాటికి ఏజెన్సీ ప్రాంతాల్లో పార్టీ బలాన్ని పెంచుకోవాలనే లక్ష్యంతో కూటమి ముందుకు సాగుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు చేరువయ్యే అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక సమస్యల పరిష్కారం, గిరిజన సంక్షేమంపై ప్రత్యేక దృష్టి వంటి అంశాల ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని అధికార పార్టీ ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు.మరోవైపు విపక్షం కూడా ఈ ప్రాంతాల్లో తన బలాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తోంది. దీంతో రానున్న రోజుల్లో ఏజెన్సీ నియోజకవర్గాలు రాష్ట్ర రాజకీయాల్లో మరింత కీలకంగా మారే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలే భవిష్యత్ ఎన్నికల్లో ఈ ప్రాంత ఓటర్ల తీర్పును ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా నిలిచే అవకాశముందని భావిస్తున్నారు.

# ఫాస్ట్ ట్రాక్‌లో పోలవరం పనులు

-మొదటిపేజీ తరువాయి

కృష్ణా, గుంటూరు జిల్లాలకు భారీ ప్రయోజనం కలుగుతుందని సీఎం చెప్పారు. 7.2 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందుతుందని, 23.5 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని, 28.5 లక్షల మందికి తాగునీరు అందించవచ్చని వివరించారు. 23.44 టీఎంసీల నీటిని పారిశ్రామిక అవసరాలకు వినియోగించు కోవచ్చని, జలవిద్యుత్ ప్రాజెక్టు పూర్తయితే 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని తెలిపారు. హైబ్రిడ్ మోడల్‌లో పంప్డ్ స్టోరేజ్ అవకాశాలను కూడా పరిశీలించాలని సూచించినట్లు చెప్పారు.

**నిర్వాసితులకు అన్యాయం జరగనివ్వం.**

2014లో ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశామని, నిర్వాసితులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడానికే పోలవరం జిల్లాను ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. రంపచోడవరం నియోజకవర్గాన్ని కేంద్రంగా చేసుకుని పోలవరం జిల్లా ఏర్పాటు చేశామని, పునరావాస బాధ్యతను నెరవేర్చేందుకు పని చేశామని తెలిపారు. గతంలో పరిహారం విషయంలో అనేక ఫిర్యాదులు వచ్చేవని, ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదన్నారు. నిజమైన అర్హులకు న్యాయం చేస్తున్నామని, ఒక ప్రాజెక్టు వల్ల కొందరు లాభపడితే మరికొందరు నష్టపోతారని, నష్టపోయిన వారికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. 2019 నాటికే పోలవరం పనుల్లో 72 శాతం పూర్తి చేశామని, అనంతరం వచ్చిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రాజెక్టు పై కక్షపూరిత ధోరణి ప్రదర్శించిందని ముఖ్యమంత్రి విమర్శించారు. టెండర్లు రద్దు చేయవద్దని పోలవరం ప్రాజెక్టు అథారిటీ సూచించినా పట్టించుకోలేదన్నారు. రూ.440 కోట్లతో నిర్మించిన డయాఫ్రం వాల్ దెబ్బతిన్నా గుర్తించలేదని, దానిని మళ్లీ నిర్మించాల్సి వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం అదే డయాఫ్రం వాల్‌పై ఈసీఆర్ఎఫ్ నిర్మాణం కొనసాగుతోందని చెప్పారు. 2014 నుంచి ఇప్పటి వరకు పోలవరం ప్రాజెక్టుపై 136 సార్లు సమీక్ష నిర్వహించానని, కేంద్ర ప్రభుత్వంతో చర్చించి నిధులు విడుదల చేయించుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమర్థవంతంగా పనిచేస్తోందని, అధికారులు సమయం కేటాయించి పనులు వేగంగా పూర్తయ్యేలా మార్గనిర్దేశనం చేస్తున్నారని చెప్పారు. ప్రాజెక్టును ఫాస్ట్‌ట్రాక్‌లో పెట్టామని, ప్రస్తుతం మొత్తం పనుల్లో 89 శాతం మేర పూర్తయ్యాయని వెల్లడించారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు పూర్తి చేస్తే, తమ ప్రభుత్వం రెండేళ్లలోనే 15 శాతం పనులు పూర్తి చేసి రూ.7,100 కోట్లు ఖర్చు చేసిందన్నారు.

**సెప్టెంబరులో వెలిగొండ:**

వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ పనులు పూర్తి చేసి సెప్టెంబరు 1 తేదీన ప్రాజెక్టు ప్రారంభిస్తామని సీఎం వెల్లడించారు. గత పాలకులు పనులు పూర్తి కాకుండానే ప్రాజెక్టును జాతికి అంకితం చేశారని.. టన్నెల్ బోరింగ్ మిషన్ ను తీయకుండానే ప్రాజెక్టు పూర్తి అయ్యిందని మభ్య పెట్టారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించిన 36 ప్రాధాన్యతా సాగునీటి ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తామన్నారు. ఉత్తరాంధ్ర సుజల శ్రవంతి ద్వారా అనకాపల్లికి, అనంతరం విశాఖకు గోదావరి జలాలను అందించి, తదుపరి గోదావరి-నాగావళి నదుల అనుసంధానాన్ని చేపడతామన్నారు. పోలవరం పూర్తయితే ప్రాజెక్టులో 194 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఏర్పడుతుందని. వరద జలాల్లో మరో 200 టీఎంసీలను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. స్పిల్‌వే, రేడియల్ గేట్లు, కాఫర్ డ్యాం పనులు పూర్తయ్యాయని తెలిపారు. 36 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాన్ని తట్టుకునేలా గేట్ల ఏర్పాటు జరుగుతోందన్నారు. గ్యాప్-1లో 40 శాతం, గ్యాప్-2లో 30 శాతం, గ్యాప్-3లో 100 శాతం పనులు పూర్తయ్యాయని, ప్రణాళిక ప్రకారమే పనులు సాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రాజెక్టు కోసం మొత్తం 94,152 ఎకరాల భూమిని సేకరించామని, అక్టోబర్ 2026 నాటికి భూసేకరణ పూర్తి చేస్తామని తెలిపారు. పునరావాసం కింద ఇప్పటికే 17,500 కుటుంబాలను తరలించామని, 2027 మార్చి నాటికి మిగిలిన వారందరికీ పునరావాసం కల్పిస్తామని చెప్పారు. ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో 17,118 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, మిగిలిన పనులు కూడా 2027 మార్చికల్లా పూర్తి అవుతాయని వెల్లడించారు. కుడికాల్వ ఎర్త్‌వర్క్స్ 100 శాతం పూర్తయ్యాయని, ఎడమకాల్వ ఎర్త్‌వర్క్స్ 99 శాతం పూర్తయ్యాయని తెలిపారు. కుడికాల్వ పై స్ట్రక్చర్లలో మరో 4 శాతం మాత్రమే మిగిలి ఉందని, ఎడమకాల్వ స్ట్రక్చర్లు 83 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులకు వెంటనే అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. లెఫ్ట్, రైట్ ఇరిగేషన్ టన్నెల్ పనులు 100 శాతం పూర్తయ్యాయని తెలిపారు.

**ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతోంది:**

జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించే ముందు రాష్ట్ర ప్రభుత్వం రూ.4,730 కోట్లు ఖర్చు చేసిందని గుర్తుచేశారు. ఫేజ్-1 పనులకు కేంద్ర ప్రభుత్వం రూ.30,436 కోట్లకు ఆమోదం తెలిపిందని, గత రెండేళ్లలోనే రూ.8,823 కోట్లు విడుదల చేసిందన్నారు. అందులో రూ.7,100 కోట్లు ఖర్చు చేశామని, ఇంకా రూ.3,835 కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉందని చెప్పారు. 22,058 నిర్వాసిత కుటుంబాలకు రూ.2,250 కోట్ల పరిహారం చెల్లించాల్సి ఉందని, ఇంటి స్థలం కొనుగోలు చేసుకునే వారికి అదనంగా రూ.2 లక్షలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి శుభారంభమని, ప్రజల చిరకాల వాంఛ, దశాబ్దాల కోరిక అని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చితో ఫేజ్-1 పూర్తవుతుందని, అనంతరం వెంటనే ఫేజ్-2 పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఉత్తరాంధ్ర సుజల శ్రవంతి ద్వారా అనకాపల్లికి, ఆపై విశాఖకు గోదావరి జలాలు అందించి, తర్వాత గోదావరి-నాగావళి అనుసంధానాన్ని అమలు చేస్తామని తెలిపారు.

**ఎత్తిపోతల పథకాలను నిర్వీర్యం చేశారు:**

గత ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలను కూడా అటకెక్కించిందని, వాటితో పాటు అన్ని సాగునీటి ప్రాజెక్టులను సరిచేస్తే మరో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులు సరైన దిశలో సాగుతుండటం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. డయాఫ్రం వాల్ దెబ్బతిన్నప్పుడు తీవ్ర మనోవేదనకు గురయ్యానని, కొన్ని సందర్భాల్లో నిద్ర కూడా పట్టలేదని పేర్కొన్నారు. భగవంతుడి ఆశీర్వాదం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో తిరిగి ప్రాజెక్టు గాడిలో పడిందన్నారు. జలధార కార్యక్రమంపై కూడా సమీక్ష నిర్వహించామని, నీరు ఉన్న ప్రాంతాల నుంచి రాష్ట్రవ్యాప్తంగా నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జలధార--జలహారతి పనులను రూ.3,300 కోట్లతో ప్రారంభించామని, సర్దుబాటు పనుల కోసం ప్రతి జిల్లాకు అదనంగా రూ.2 కోట్లు కేటాయిస్తున్నామని చెప్పారు. ప్రతీ గ్రామంలో కురిసే వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మళ్లించి సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

**37 సార్లు సందర్శన- 136 సార్లు సమీక్షలు:**

ప్రాజెక్టు లోని ప్రధాన కట్టడ మైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ గ్యాప్ 2, గ్యాప్ 1 పనుల్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టు సందర్శనలో భాగంగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రం పనుల్ని కూడా ముఖ్యమంత్రి పరిశీలించారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు డ్యామ్ సైట్ వద్ద కాన్ఫరెన్సు హాలులో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు.ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యామ్ గ్యాప్ 2, గ్యాప్ 1 పనులు నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. కుడి, ఎడమ కాలువల కనెక్టివిటీ టన్నెల్ పనులు ఈ నెలాఖరుకు పూర్తి అవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రాజక్టు డ్యామ్ కు చేరుకునే వివిధ రోడ్లు, కుడి, ఎడమ గట్లకు సంబంధించిన పనులు, గండి పోచమ్మ ఆలయం అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. పునరావాసం, పరిహారం అందించే విషయంలో నిర్వాసితులకు ఇబ్బంది లేకుండా చూడాలని సీఎం సూచించారు. ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసే అంశంపై నిరంతరం శ్రద్ధ వహిస్తున్న సీఎం చంద్రబాబు 2014 నుంచి ఇప్పటి వరకూ 37 సార్లు ప్రాజెక్టును నేరుగా సందర్శించారు. అలాగే ప్రాజెక్టు సైట్ తో పాటు సచివాలయంలో 136 సార్లు అధికారులతో సమీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారధి, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల శాసనసభ్యులు, జలవనరుల శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత

-మొదటిపేజీ తరువాయి

చేశారని ముఖ్యమంత్రి అడిగారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని పిచ్చుకలంకలో రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గోదావరి డెల్టాకు దేశానికే అన్నపూర్ణ అనే ఖ్యాతి రావడానికి సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్టే కారణమని, అనంతరం ఎన్టీఆర్ హయాంలో నిర్మించిన కొత్త బ్యారేజీతో మరో పంటకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. రాష్ట్ర పునర్నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రధాని నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ నెలలోనే తల్లికి వందనం నిధులు జమ చేస్తామని, సామాజిక భద్రత పెన్షన్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ ప్రజల మధ్యకే రావాలనే తపనతో ఉన్నారని, ముంబై వెళ్లి ఆయనను పరామర్శించి పూర్తిగా కోలుకున్న తర్వాతే ప్రజాసేవలో పాల్గొనాలని సూచించినట్లు చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని... ఆడవాళ్లని అసభ్యంగా మాట్లాడే వారిని గొడ్డలి పార్టీ సమర్థిస్తోందని విమర్శించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ... గొడ్డలి పార్టీ నేతలు ఫైనాన్స్ చేస్తున్నారు.. స్టూడియోలు పెట్టిస్తున్నారని విమర్శించారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లను గొడ్డలి పార్టీ సపోర్ట్ చేస్తోందని... వారికి డబ్బులిచ్చి ప్రోత్సహిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. వీళ్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, పొంగూరు నారాయణ, వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పేరుకుపోయిన చెత్తని 10 రోజుల్లో తొలగించండి

-మొదటిపేజీ తరువాయి

తీసుకోవాలని చైర్మన్ పట్టాభిరామ్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రతిపాదిత గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ తాత్కాలిక సేకరణ, చెత్త వేర్వేరుగా విభజించే కేంద్రంగా పనిచేస్తుంది. ఇక్కడ సేకరించిన చెత్తను కాంపాక్టర్ల ద్వారా జిందాల్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌కు తరలించి శాస్త్రీయ పద్ధతిలో నిర్మూలిస్తారు. ఈ అత్యాధునిక బదిలీ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన లేఅవుట్, ప్రణాళిక, డిజైన్, సాంకేతిక అంశాల రూపకల్పనలో సహాయపడేందుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ ఇంజనీరింగ్ బృందాన్ని పంపిస్తుందని చైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు. వీధి వీధిలో దుకాణాల వెంట తిరిగి చెత్త సేకరించే సాధారణ టిప్పర్ కార్యకలాపాలకు బదులుగా, పనితీరు సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి 'ఎలక్ట్రిక్ వాహనాలను' వినియోగించవచ్చని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ సూచించారు. సర్వీస్ మోడల్ లో అనుభవం కలిగిన ఏజన్సీల నుంచి వాహనాలను తీసుకుని అద్దె చెల్లించవచ్చని, తద్వారా మున్సిపల్ ఘన వ్యర్థాల సేకరణ సమర్థవంతంగా జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ సీజీఎం ఐఎల్ రామ్, ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ చైర్మన్ సుంకర దుర్గా ప్రసాద్, జోనల్ మేనేజర్ అండ్ కమిషనర్ బాబ్జీ, డిప్యూటీ జోనల్ మేనేజర్లు ఎం.దొరబాబు, జి.జ్యోతి, ఫైనాన్స్ మేనేజర్ జి.బాలమ్మ, మేనేజర్ (ఇంజనీరింగ్) ఎండీ ఇస్మాయిల్ బేగ్, విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ ఏఎంహెచ్ఓ గోపాల నాయక్, తాడిగడప మున్సిపల్ కమిషనర్ నజీర్, శానిటరీ ఇనస్పెక్టర్ సుధాకర్, కాంపాక్టర్ మెయింట్ నెన్స్ టీమ్ ఇన్ చార్జి నూతక్కి రామమోహన్, ఆటోనగర్ ఐఏఎల్ఏ మాజీ అధ్యక్షులు ఎస్.దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో ముగింపు దశకు ఓటర్ల జాబితా సవరణ

-మొదటిపేజీ తరువాయి

ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్నారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా మొత్తం 4 కోట్ల 16 లక్షల 26 వేల 144 ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఈ ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. పంపిణీ చేసిన వాటిలో ఇప్పటివరకు 3 కోట్ల 69 లక్షల 50 వేల 812 మంది ఓటర్ల వివరాలను ఆన్‌లైన్ చేశారు. అంటే మొత్తంగా 88 శాతం మంది ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. ఇంకా 1.67 శాతం ఫారాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

**లక్షల్లో మృతి చెందిన, వలస వెళ్లిన ఓటర్లు**

ఈ సర్వేలో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 14,19,644 లక్షల మంది ఓటర్లు చనిపోయినట్లు అధికారులు గుర్తించారు. ఇది మొత్తం ఓటర్లలో 3.41 శాతంగా ఉంది. అలాగే, ఉపాధి, ఇతర కారణాల వల్ల శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన (షిఫ్ట్ అయిన) ఓటర్లు కూడా భారీగానే ఉన్నారు. ఇలాంటి వారు 12,14,994 లక్షలు ఉన్నట్లు సర్వేలో తేలింది.

**అందుబాటులో లేని వారు**

బీఎల్‌ఓలు ఓటర్ల ఇళ్లకు నేరుగా వెళ్లినప్పటికీ కొందరు అందుబాటులో లేరు. ఇలా సుమారు 7,26,425 లక్షల (1.75 శాతం) ఓటర్లు దొరకలేదని అధికారులు పేర్కొన్నారు. చనిపోయిన ఓటర్లను పక్కన పెడితే, ఈ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఇంకా 9 శాతానికి పైగా పూర్తి కావాల్సి ఉందని సీఈవో వివేక్ యాదవ్ స్పష్టం చేశారు.

**గడువు పొడిగింపునకు సిఫార్సు**

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ గడువు ముగుస్తుండటంతో వివిధ రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. గడువును పెంచాలని కోరుతూ సీఈవోకు వినతిపత్రాలు సమర్పించాయి. దీనికి తోడు కొన్ని పట్టణ (అర్బన్) ప్రాంతాల్లో సర్వే నెమ్మదిగా సాగుతోంది. ఈ నేపథ్యంలో వివిధ జిల్లాల కలెక్టర్లు సైతం గడువు పొడిగింపునకు సూచనలు చేశారు. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్, కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రత్యేకంగా లేఖ రాశారు. ప్రక్రియను వంద శాతం పారదర్శకంగా పూర్తి చేసేందుకు గడువు పెంచాలని ఆ లేఖలో ఆయన ఈసీని కోరారు.


## చిన్నారుల కేంద్రాలకు కొత్త చిగురు

-మొదటిపేజీ తరువాయి

భవనాలను నిర్మించి వీటిని తరలించాలని సీఎం ఆదేశించారు. అందులో భాగంగా ఈ ఏడాది మరో 2 వేల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు కేంద్రానికి నివేదించారు. వివిధ దశల్లో ఉన్న 2,930 కేంద్రాల్లో 915 భవనాల నిర్మాణం తుది దశలో ఉంది. వీటిని నెల, రెండు నెలల్లో పూర్తి చేయవచ్చు. టీడీపీ ప్రభుత్వం చేపట్టిందనే ఏకైక కారణంతో జగన్ వీటిని పూర్తి చేయకుండా వదిలేశారు. పెరిగిన ధరల మేరకు అసంపూర్తిగా ఉన్న ఒక్కో భవనం పూర్తి చేసేందుకు ఇప్పుడు లక్ష నుంచి 5 లక్షల వరకు అవసరమవుతుందని అధికారులు చెబుతున్నారు.

కొత్తగా మంజూరైన అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక్కో దాని నిర్మాణానికి 12 లక్షల రూపాయలు ఇస్తారు. ఇందులో వీబీ జీరామ్ జీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్‌గా 8 లక్షలు, 16వ ఆర్థిక సంఘం నిధులు కింద 2 లక్షలు, మిగతా 2 లక్షల్లో 1.20 లక్షలు కేంద్రం, మరో 80 వేలు రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తాయి. సాధ్యమైన చోట, భవనాలు అందుబాటులో ఉన్నచోట కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలను పాఠశాల ప్రాంగణాలకు తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే, సుమారు 10,000 కేంద్రాలు పాఠశాల ప్రాంగణాల్లో పనిచేస్తున్నాయి. మరికొన్నింటిని తరలించే అవకాశాన్ని పరిశీలించడానికి అధికారులు జిల్లాలోని ఒక మండలాన్ని చేపట్టారు. 85 వరకు కేంద్రాలు పాఠశాలకు కిలోమీటరు లోపు దూరంలోనే ఉన్నట్లు తెలిసింది.మిగతా మండలాలకు కూడా అనువైన వాటిని తరలించాలని నిర్ణయించారు. ఆగిపోయిన పాత అంగన్వాడీ కేంద్రాలను కూటమి ప్రభుత్వం కొత్తగా నిర్మించడానికి సన్నాహాలు చేయడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఉదాహరణకు గుంటూరు జిల్లాలో మొత్తం 32 అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం చేపట్టింది. గుంటూరు అర్బన్ పరిధిలో 4 కేంద్రాలు, మంగళగిరి మండలంలో 4, ఫిరంగిపురం మండలంలో 9, పొన్నూరు మండలంలో 6, ప్రత్తిపాడు మండలంలో 2, తెనాలి మండలంలో 7 అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం ప్రారంభించగా వైఎస్సార్సీపీ ప్రభుత్వం వచ్చాక పనులు నిలిచిపోయాయి. జిల్లాలోని 32 కేంద్రాలు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. పల్నాడు జిల్లాలో 2031 కేంద్రాలుండగా, నిర్మాణం చేపట్టిన వాటిలో 56 చివరి దశలో, 14 స్లాబ్ లెవల్ దశలో, 2 రూఫ్ లెవల్ దశలో, 2 బేస్మెంట్ లెవల్ దశలో ఉండగా, మొత్తంగా 74 భవనాలు పూర్తి చేయాల్సి ఉండగా వీటి కోసం మూడు కోట్ల 80 లక్షల వరకు ఖర్చు చేయనున్నారు. బాపట్ల జిల్లాలో అసంపూర్తిగా ఉన్న 18 అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం వెంటనే పూర్తి చేసి చిన్నారులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# ధవళేశ్వరం బ్యారేజి గేట్ల ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టిన చంద్రబాబు.





- గోదావరి డెల్టా రైతాంగాన్ని ఆదుకుంటున్న రైతు బాంధవులు ముఖ్యమంత్రి చంద్రబాబు.
- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.

**ధవళేశ్వరం, పెన్ సత్తా, జులై 13:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రదాతగా, రైతు పక్షపాతిగా, అధికారం అంటేనే బాధ్యతగా పేద ప్రజలకు సేవ చేయడానికి భగవంతుడు ఇచ్చిన అవకాశంగా భావిస్తూ నిరంతరం రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రశంసించారు. ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీకి 117 నూతన గేట్ల ఏర్పాటు, మరమ్మత్తు పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టడం ఈ ప్రాంత రైతులు చేసుకున్న అదృష్టమని ఎమ్మెల్యే బండారు కొనియాడారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పిచ్చుకలంకలో ఏర్పాటు చేసిన రైతులతో ముఖాముఖి సభలో మంత్రులు నిమ్మల రామానాయుడు, పొంగూరు నారాయణ, వాసంశెట్టి సుభాష్, కందుల దుర్గేష్, ఎంపీ హరీష్ మాధుర్, జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, తన సహచర ఎమ్మెల్యేలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు ప్రసంగిస్తూ రైతు ఇరిగేషన్ శాఖామంత్రిగా ఉంటే ఆ శాఖ అద్భుతమైన పనితీరు కనబరుస్తుందని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ప్రత్యేకంగా ప్రశంసించారు. నాడు కాటన్ మహాశయుడు సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నిర్మించి ఈ ప్రాంత ప్రజలకు అన్నం పెడితే, ఈ బ్యారేజీని కాపాడటానికి నేనున్నాను అంటూ 117 గేట్ల ఆధునికీకరణ పనులు రూ.150 కోట్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టారని, ఈ ప్రాంత ప్రజల పట్ల రైతుల పట్ల ఆయనకున్న ప్రేమాభిమానాలకు ఇది నిదర్శనమన్నారు. వైసిపి గొడ్డలి పార్టీ ప్రభుత్వంలో బ్యారేజ్ గేట్లకు గ్రీజు కూడా పెట్టలేదని, బేరింగ్లు కూడా బిగించలేదని, చిన్న చిన్న మరమ్మత్తులు కూడా చేపట్టకపోవడంతో బ్యారేజీ అస్తిత్వమే ప్రమాదంలో పడిందన్నారు. ఈ అంశాన్ని గ్రహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బ్యారేజీకి ఎటువంటి ప్రమాదం జరగకూడదు, గోదావరి డెల్టా రైతాంగానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకూడదనే ఆలోచనతో బ్యారేజీ ఆధునీకరణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రైతాంగం పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టిసీమతో కృష్ణ డెల్టాకు ఊపిరి పోసారన్నారు. వెలుగోడు నిర్వాసితులకు పరిహారం అందజేసారన్నారు. పోలవరం ప్రాజెక్టును పరుగులు పెట్టిస్తున్నారని ప్రశంసించారు. నీటిపారుదల రంగానికి, రైతుల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ఐదేళ్ల గొడ్డలి పార్టీ పరిపాలనలో రాష్ట్రంలో చేసిన ఆర్థిక అని విధ్వంసాన్ని, అరాచకాలను సరిదిద్దడానికి తన అపారమైన అనుభవంతో అనునిత్యం ముఖ్యమంత్రి శ్రమిస్తున్నారని, రాష్ట్రాన్ని చక్కదిద్దుకుంటూ ముందుకు వెళ్తున్నారని కొనియాడారు. సెంట్రల్ డెల్టాను కాపాడడానికి లొల్ల లాకుల పునర్నిర్మాణానికి నిధులు కోరితే వెంటనే రూ.74.20 కోట్లు మంజూరు చేశారని గుర్తుచేశారు. అందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అభినవ కాటన్ దొరలా, అపర భగీరథునిలా గోదావరి డెల్టా ఆధునికీకరణ పనులు సైతం చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. కాటన్ ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థను కాపాడే శక్తి ముఖ్యమంత్రి చంద్రబాబుకి మాత్రమే ఉందన్నారు. బిందు సేద్యం, ప్రకృతి సేద్యం, వ్యవసాయ ఆధునికీకరణ అన్నదాత సుఖీభవ మొదలైన పథకాలతో అన్నదాతలకు అండగా నిలుస్తున్నారన్నారు. ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని చేపట్టిన ముఖ్యమంత్రికి, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే కొత్తపేట నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా వాడపల్లి దేవస్థానం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే బండారు కోరారు. అలాగే పిచ్చుకలంకను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, ఏటిగట్ల బలోపేతానికి నిధులు కేటాయించాలని, నదీపాత నివారణకు, కొత్తపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయ నిర్మాణానికి వ్యవసాయ మార్కెట్ కు సంబంధించిన స్థలం కేటాయింపు, కొత్తపేట ఎమ్మార్వో కార్యాలయం నిర్మాణానికి నిధుల కేటాయింపు, వంతెనల నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. పేరూరు వై జంక్షన్ నుంచి రావులపాలెం జాతీయరహదారి వరకూ మధ్యలో ప్రతిపాదించిన జాతీయ రహదారిని త్వరితగతిన అభివృద్ధి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి ఈ పనులన్నీ చేపడతానని సానుకూలంగా స్పందించారు.



# ప్రజా సమస్యల త్వరితగతిన పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం.

- రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత.
- బాధితుల సమస్యల పై అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేసిన హోం మంత్రి, జిల్లా ఎస్పీ.
- పోలీసు ఉన్నతాధికారులతో విస్తృత స్థాయి 'క్రైమ్ రివ్యూ' నిర్వహించిన మంత్రి.













**అనకాపల్లి, పెన్ సత్తా, జూలై 13**: జిల్లాలోని సామాన్య ప్రజలు, మహిళలు, బాధితుల సమస్యలను త్వరితగతిన, పారదర్శకంగా పరిష్కరించడమే లక్ష్యంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడింది.
ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేశారు.
జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తో కలిసి హోం మంత్రి సోమవారం ఈ కార్యక్రమంలో పాల్గొని, జిల్లా నలుమూలల నుండి వచ్చిన బాధితుల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. ప్రతి ఒక్కరి సమస్యను ఎంతో ఓపికగా, స్వయంగా అడిగి తెలుసుకున్న మంత్రి, అక్కడి కక్కడే చట్టపర మైన పరిష్కారం చూపాలంటూ సంబంధిత పోలీసు అధికారులకు స్పష్ట మైన ఆదేశాలు జారీ చేశారు. హోం మంత్రి మాట్లాడుతూ
ప్రజల చెంతకే పాలనను అందించడం, శాంతి భద్రతలను కాపాడటమే మా కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత. గతంలో ప్రజలు తమ సమస్యలను చెప్పు కోవడానికి కూడా భయపడే పరిస్థితి ఉండేది. కానీ నేడు, సామాన్య పౌరుడికి, ముఖ్యంగా మహిళలకు పూర్తి భరోసా కల్పించేలా పోలీసు యంత్రాంగం పనిచేస్తోంది. అనకాపల్లి జిల్లాలో ఎస్పీ తుహిన్ సిన్హా నేతృత్వంలో పోలీసులు ప్రజలకు ఎంతో జవాబుదారీగా ఉంటూ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను నిజం చేస్తున్నారు. ఈ రోజు పిజిఆర్ఎస్ కి వచ్చిన ప్రతి అర్జీని నేను, ఎస్పీ స్వయంగా పరిశీలించాము. సివిల్ వివాదాలు, కుటుంబ గొడవలు, సైబర్, ఆర్థిక మోసాల బారిన పడిన బాధితులకు తక్షణ న్యాయం చేయాలని అధికారులను ఆదేశించాను. ప్రజలు ఎవరూ అధైర్యపడొద్దు, మీ వెనుక ప్రభుత్వం, చట్టాన్ని రక్షించే పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటాయి అన్నారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ హోం మంత్రి స్వయంగా మన జిల్లా పోలీసు కార్యాలయానికి విచ్చేసి, బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం మా పోలీసు యంత్రాంగానికి ఎంతో ఉత్సాహాన్ని, బాధ్యతను పెంచింది. అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల పరి రక్షణకు, మహిళల భద్రతకు మేము అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాము. మంత్రి ఆదేశాల మేరకు.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) లో వచ్చిన ప్రతి ఫిర్యాదు పై తక్షణమే విచారణ జరిపి, నిర్ణీత సమయం లోగా బాధితులకు పూర్తి న్యాయం జరిగేలా చూస్తాం. చట్టాన్ని ఉల్లంఘించే వారి పై, ముఖ్యంగా మహిళల పై అరాచకాలకు పాల్పడే వారి పై ఉక్కుపాదం మోపుతాం.
అధికారులతో క్రైమ్ రివ్యూ (నేర సమీక్షా సమావేశం) -- కీలక గణాంకాలు,
ఫిర్యాదుల స్వీకరణ అనంతరం, హోం మంత్రి జిల్లా పోలీస్ ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా 'క్రైమ్ రివ్యూ' నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న నేరాల శాతం, కేసుల పురోగతి, గంజాయి నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. 1. జిల్లాలో తగ్గిన నేరాల శాతం: గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో పలు విభాగాల్లో నేరాలు గణనీయంగా తగ్గాయి. 2, మహిళలపై నేరాలు: గత ఏడాది 606 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది అది 567 కి తగ్గి, -7.00% తగ్గుదల నమోదైంది. 3, గంజాయి, ఎన్డిపిఎస్ కేసులు: గత ఏడాది 180 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 111 కేసులతో -38.33% భారీ తగ్గుదల నమోదైంది. 4, మొత్తం దర్యాప్తులో ఉన్న కేసులు: గత ఏడాది 3,914 నుండి ఈ ఏడాది 2,802 కి తగ్గి, 28.41% క్రైమ్ రేటు తగ్గింది. 5, సైబర్ నేరాలు, సోషల్ మీడియా: సైబర్ నేరాలు 26.8%, సోషల్ మీడియా అపరాధాలు 65% పెరిగినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దీని పై ప్రత్యేక నిఘా పెట్టాలని హోంమంత్రి ఆదేశించారు.
మహిళల పై జరిగే ఆత్మహత్య ప్రేరేపణ (-60%), వరకట్న వేధింపుల మరణాలు (-50%), మహిళా హత్యలు (-50%), మరియు అత్యాచార కేసులు (-66.6%) గణనీయంగా తగ్గాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సమర్థవంత మైన నాయకత్వాన్ని హోం మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. జిల్లాలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపులో ఉండటమే కాకుండా, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాల ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతూ, తక్కువ కాలంలోనే నేరాల నియంత్రణలో ఇటువంటి మెరుగైన ఫలితాలు సాధించినందుకు అనకాపల్లి జిల్లా పోలీసు అధికారులను, సిబ్బందిని మంత్రి అభినందించారు.
ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు, డీఎస్పీలు జీ.ఆర్.ఆర్.మోహన్, పి.శ్రీనివాసరావు, బి.మోహనరావు, ఈ.శ్రీనివాసులు, కె.రవి కుమార్, సీఐలు బాల సూర్యరావు, లక్ష్మి, శ్రీనివాసరావు, సతీష్, రమణయ్య, సురేష్, రామకృష్ణా రావు, మన్మధ రావు, జిల్లా సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మృత్యు మార్గానికి చరమగీతం, వార్డు ప్రజల దశాబ్దాల కల సాకారం గణబాబు.

- రైల్వే ట్రాక్‌ల ప్రమాదకర ప్రయాణం నుండి కాలనీ వాసులకు శాశ్వత విముక్తి.
- రైల్వే డిఆర్ఎం తో నిరంతరం పోరాడి, ప్రత్యేక అనుమతులు సాధించిన గణబాబు.
- నడక మార్గంగా తీర్చిదిద్ది గణవిజయ మార్గ్ అండర్‌పాస్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే గణబాబు.







**విశాఖపట్నం, పెన్ సత్తా, జులై 13:**
విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధి లోని 56 వ వార్డు ప్రజల దశాబ్దాల నాటి ప్రాణ సంకట దారికి ఎట్టకేలకు శాశ్వత విముక్తి లభించింది. నిత్యం మృత్యువుతో పోరాడుతూ సాగుతున్న చాకలిగెడ్డ, దయానంద నగర్, రాజీవ్ కాలనీ ప్రాంతాల ప్రజల ప్రయాణ కష్టాలను తుడిచిపెడుతూ, స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ గణబాబు సాధించిన చారిత్రాత్మక విజయానికి ప్రతీకగా రూపుదిద్దుకున్న గణవిజయ మార్గ్ అండర్‌పాస్ (పాదచారుల మార్గం) అత్యంత వైభవంగా ప్రారంభించబడింది.
నిత్యం మృత్యువుతో దోబూచులాడిన బతుకులు: 56 వ వార్డు పరిధి లోని ఈ మూడు కాలనీల ప్రజలు మార్కెట్‌కు వెళ్లాలన్నా, పిల్లలు పాఠశాలలకు వెళ్లాలన్నా, అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు లేదా మెయిన్ రోడ్‌కు చేరుకోవాలన్నా, ఏకంగా 7 రైల్వే ట్రాక్‌లను దాటాల్సిన అత్యంత ప్రమాదకర పరిస్థితి ఉండేది. దీనికి తోడు, నిత్యం వాషింగ్ షెడ్‌కు వెళ్లే రైళ్లు గంటల తరబడి ఈ ట్రాక్‌ల పైనే నిలిచిపోయేవి. వేరే ప్రత్యామ్నాయ మార్గం లేక, స్థానికులు నిలిచి ఉన్న రైళ్ల కింద నుండి దూరి, బోగీల లోపలి నుండి ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని దాటాల్సి వచ్చేది. ఈ క్రమంలో గతంలో అనేకమంది ప్రమాదాల బారిన పడి, కాళ్లు, చేతులు కోల్పోవడమే కాకుండా ఎంతో మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన విషాదకర చరిత్ర ఈ ప్రాంతానికి ఉంది.
భగీరథ ప్రయత్నంతో అనుమతులు సాధించిన గణబాబు. స్థానిక ప్రజల దశాబ్దాల నాటి ఈ కన్నీటి గాథను చూసి చలించిన ఎమ్మెల్యే గణబాబు, ఈ సమస్యకు ఎలాగైనా ఒక శాశ్వత పరిష్కారం చూపాలని గట్టి సంకల్పంతో ముందడుగు వేశారు. ఈ క్రమంలో రైల్వే అధికారుల నుండి అనుమతులు సాధించడం అంత సులభం కాకపోయినప్పటికీ, ఆయన వెనకడుగు వేయలేదు. పక్కనే ఉన్న గెడ్డకు సంబంధించిన 7 మదుల లోని ఒక మదుమును పాదచారులు, వాకర్స్ రాకపోకల కోసం అండర్‌పాస్‌గా మార్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు.
ఇందుకోసం రైల్వే డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్ఎం)తో అనేకమార్లు ప్రత్యేకంగా సమావేశమై, క్షేత్రస్థాయి పరిస్తితులను, ప్రజల ప్రాణాల విలువను వారికి వివరించారు. నిరంతర ఫాలో అప్, సుదీర్ఘ పోరాటం తర్వాత ఎట్టకేలకు రైల్వే ఉన్నతాధికారుల నుండి అండర్‌పాస్ వినియోగానికి అనుమతులు సాధించడంలో గణబాబు విజయం సాధించారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు, గణవిజయ మార్గ్ ఆవిష్కరణ. అనుమతులు వచ్చిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా, ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, నిధులు కేటాయించి ఆ అండర్ పాస్‌కు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించారు. బురదమయంగా, చీకటిగా ఉన్న ఆ మార్గాన్ని ప్రజలు సురక్షితంగా నడిచేలా, వసతులతో తీర్చిదిద్దారు. ఎందరో ప్రాణాలు కాపాడిన ఈ విజయవంత మైన మార్గానికి గణవిజయ మార్గ్ అని ప్రజలు నామకరణం చేయగా, స్థానిక ప్రజల సమక్షంలో ఎమ్మెల్యే గణబాబు రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. కాలనీల్లో పండుగ వాతావరణం, ఎమ్మెల్యేకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు. ఈ అండర్ పాస్ ప్రారంభంతో చాకలిగెడ్డ, దయానంద నగర్, రాజీవ్ కాలనీ పరిసర ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. కాలనీల మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు ఎమ్మెల్యే గణబాబు కి మంగళహారతులతో, పూలమాలలతో ఘనస్వాగతం పలికారు. మా తరతరాల కష్టాన్ని తీర్చి, మా పిల్లల ప్రాణాలకు రక్షణ కల్పించిన దేవుడు ఎమ్మెల్యే గణబాబు అంటూ స్థానిక ప్రజలు ఉద్వేగానికి లోనయ్యారు. తమ ప్రాణ సంకటాన్ని తప్పించినందుకు ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎమ్మెల్యే కి జీవితాంతం రుణపడి ఉంటామని సగర్వంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సరగడం రాజశేఖర్, స్థానిక నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, వేలాదిగా తరలివచ్చిన కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## గాయపడ్డ కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.

ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి డిమాండ్.



**పరవాడ, పెన్ సత్తా, జులై 13:** ఫార్మా సిటీలో టోరెంట్ ఫార్మా పరిశ్రమలో సల్ఫ్యూరిక్ యాసిడ్ పడి ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. ఎన్. నాగరాజు కెమిస్ట్ ముఖం పై, కుడి భుజం పైన కాలిన గాయాలయ్యాయి. దీని పై సమగ్ర విచారణ చేసి గాయపడ్డ కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం తెల్లవారు జరిగిన ఈ ప్రమాదంలో సల్ఫ్యూరిక్ యాసిడ్ కింది నుండి చైన్ సహాయంతో ఫస్ట్ ఫ్లోర్ కి తరలిస్తుండగా ఒక్కసారిగా చైన్ తెగిపోవడంతో ఒక్కసారిగా డ్రమ్ము కిందపడి పగిలిపోయింది. దీంతో పక్కనే ఉన్న నాగరాజు మరో కార్మికులకు ప్రమాదానానికి గురయ్యారు. దీని పై సమగ్ర విచారణ చేసి చర్యలు చేపట్టాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

## అర్జీల పరిష్కారం నిర్లక్ష్యం చేయకుండా, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి.

- ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత.
- జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్.





**అనకాపల్లి, పెన్ సత్తా, జూలై 13:** పీజీఆర్ఎస్ అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా, నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ మందిరంలో ప్రజా పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ తో, పాటు ఇంచార్జ్ డిఆర్ఓ వై శ్రీనివాస్ రావు లు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దరఖాస్తుదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా రెవిన్యూ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, ఏడి సర్వే, ఇరిగేషన్, జీవీఎంసీ, ఏడి అగ్రికల్చర్, మైనింగ్, ట్రైబల్ వెల్ఫేర్, లేబర్ ఆఫీస్, ఫిషరీస్, ఏపీఎస్ ఆర్టీసీ, డ్వామ, తాగునీరు తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పీజీఆర్ఎస్‌లో నమోదైన అర్జీలను కేవలం సమస్యలను పరిష్కరించడమే ముఖ్యం కాదని, ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందేలా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి శాశ్వత పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదులు ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉండకూడదని, గడువు ముగియక ముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ శాఖలలో నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ అమలు పనితీరుని శాఖల వారిగా జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఈ-ఆఫీస్ తప్పనిసరిగా అమలు చేయాలని, సిబ్బంది అందరికి లాగిన్ ఉండాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. వాట్సాప్ గవర్నన్స్ పై ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు.

ఫిర్యాదులను తిరస్కరించాల్సి వస్తే, దానికి సరైన కారణాలను తెలియజేస్తూ ఫిర్యాదుదారునికి లిఖితపూర్వక సమాచారం ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పెండింగ్ అర్జీలు అధికంగా ఉన్న శాఖల అధికారులకు ప్రత్యేక సూచనలు జారీ చేస్తూ, సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యల పై 215 అర్జీలు అందాయి. అదేవిధంగా రెవెన్యూ క్లినిక్ కు 242 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా లోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేస్తున్న ఎంఎంఎన్ పరశు రామ రాజు.





**విశాఖపట్నం, పెన్ సత్తా, జులై 13:** సోమవారం జరుగుతున్నటువంటి జనతా వారధి, ప్రజలకు ప్రభుత్వానికి వారధి కార్యక్రమంలో భాగంగా బీజేపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు ఎంఎంఎన్ పరశు రామ రాజు, బీజేపీ నాయకులతో కలిసి సోమవారం జిల్లాలో గల పలు సమస్యల పై జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పరశు రామ రాజు మాట్లాడుతూ గతంలో జరిగిన పరిపాలనా నిర్లక్ష్యం కారణంగా ఒకే ఆధార్ నంబర్‌కు పలువురు విద్యుత్ వినియోగదారుల సేవలు అనుసంధానం కావడంతో అర్హులైన పేద, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పెన్షన్లు, ఇతర ప్రభుత్వ సేవలకు దూరమవుతున్న సమస్యను ప్రత్యేక డ్రైవ్ ద్వారా పరిష్కరించడం, ఈఆర్ఓ లలో సిబ్బందిని బలోపేతం చేయడం, వినియోగదారుల సేవలను మెరుగుపరచడం గురించి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనతా వారధి కో కన్వీనర్ మూలా వెంకటరావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు అత్తిలి శంకర రావు, బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి.

- దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు.
- రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు.


**అనకాపల్లి, పెన్ సత్తా, జూలై 13:** సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) ద్వారా ప్రజలు ఆశిస్తున్న పారదర్శక మైన, అవినీతి రహిత పాలనను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ అధికారులు పనిచేయాలని రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం రాష్ట్ర సమాచార కమిషనర్ జిల్లా అధికారులతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా సమాచార కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి, అవినీతి నిర్మూలనతో కూడిన సుపరిపాలనను అందించడానికి సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) ఒక దిక్సూచిలా పనిచేస్తుందని స్పష్టం చేశారు. కేవలం సెక్షన్ 6(1) కింద దరఖాస్తులు స్వీకరించి సమాచారం ఇవ్వడమే కాకుండా, ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేసేలా ఈ చట్టం నిర్దేశిస్తుందని తెలిపారు. వంద శాతం అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, దానిని అడ్డం పెట్టుకుని వ్యక్తిగత స్వార్థానికి, వేధింపులకు పాల్పడే వారి పై కఠినంగా వ్యవహరిస్తామని కమిషనర్ హెచ్చరించారు. సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) లక్ష్య సాధనకు ప్రతి ప్రభుత్వ అధికారి ప్రజల పట్ల జవాబుదారీతనం పెరగాలని, ప్రభుత్వ నిర్ణయాల ప్రక్రియలో పూర్తి పారదర్శకత ఉండాలని, క్షేత్రస్థాయిలో అవినీతిని పూర్తిగా అరికట్టి, ప్రజలకు మెరుగైన సుపరిపాలన అందించాలని పేర్కొన్నారు.

ఆర్టిఐ దుర్వినియోగం పై కఠిన నిర్ణయాలు - బ్లాక్‌లిస్ట్.. ఇటీవల కాలంలో కొందరు అలవాటుగా పదే పదే దరఖాస్తులు చేస్తూ అధికారులను వేధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని కమిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ నేపథ్యంతో, సమాచారాన్ని అడ్డం పెట్టుకుని బ్లాక్ మెయిలింగ్ కు పాల్పడటం, సివిల్ వివాదాలను సృష్టించడం వంటి అక్రమాలకు కొందరు పాల్పడుతున్నారు. ఇలాంటి వారి పై ఇప్పటికే కఠిన చర్యలు ప్రారంభించామని, ఇటీవల నా బెంచ్ లోనే నలుగురు-ఐదుగురు అక్రమ దరఖాస్తుదారులను బ్లాక్ లిస్ట్‌లో పెట్టడం జరిగిందని. కమిషనర్ పేర్కొన్నారు. ఆర్టిఐ ని దుర్వినియోగం చేసే వారి వివరాలను సేకరించి, అన్ని శాఖల అధిపతులకు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, కలెక్టర్లు తమ తమ అధికారిక వెబ్‌సైట్లలో ఉంచాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అధికారులకు కీలక మార్గదర్శకాలు.. ...దరఖాస్తులను పరిష్కరించేటప్పుడు అఫిడవిట్లు, ఆధారాలను పరిశీలించి, సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి ప్రజా ప్రయోజనం లేని, కేవలం ప్రభుత్వ పనిని నిలిపివేయాలనే ఉద్దేశంతో అడిగే భారీ సమాచార దరఖాస్తులను చట్టం యొక్క అసలు స్ఫూర్తిని (స్పిరిట్ అఫ్ ది యాక్ట్) దృష్టిలో ఉంచుకుని నియంత్రించవచ్చని, ఇటువంటి కేసులను కమిషన్ కూడా సమీక్షిస్తుందన్నారు. సమాచారం అడిగినంత మాత్రాన దరఖాస్తుదారుడిని ప్రభుత్వానికి వ్యతిరేకిగా భావించకూడదని, అడిగిన సమాచారాన్ని ఇవ్వడం మన బాధ్యత. ఒకవేళ సమాచారం ఇవ్వలేకపోతున్నామంటే, మన నిర్ణయాత్మక ప్రక్రియలో ఎక్కడో లోపం ఉందని తెలిపారు. సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) కింద దరఖాస్తుదారులు కోరే సమాచారాన్ని పారదర్శకంగా, నిబంధనలకు లోబడి, చట్టం పరిధిని, రికార్డుల లభ్యతను, మినహాయింపులను పూర్తిగా అవగాహన చేసుకుని నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు.











ప్రతి కార్యాలయంలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా సమాచార బోర్డులు, సిటిజన్ చార్టర్లు, జాబ్ చార్టర్లను ఏర్పాటు చేయాలని, కార్యాలయ సమాచారానికి సంబంధించిన 4(1)(బి) నిబంధనలను కచ్చితంగా మెయింటైన్ చేయాలన్నారు. దరఖాస్తుల నమోదు కోసం రిజిస్టర్-1, రిజిస్టర్-2 లను నిరంతరం అప్‌డేట్ చేస్తూ నిర్వహించాలని, సెక్షన్ 6(1) కింద వచ్చే దరఖాస్తులను దరఖాస్తు అందిన నెల రోజుల్లోగా (30 రోజులు) కచ్చితంగా పరిష్కరించాలి. అయితే సమాచారం ఇవ్వడం లేదా నిబంధనల ప్రకారం ఎండార్స్‌మెంట్ ఇవ్వడం చేయాలన్నారు. కోరిన సమాచారం తమ కార్యాలయానికి సంబంధించినది కానిచో, సెక్షన్ 6(3), 5(3) నిబంధనల ప్రకారం 5 రోజుల్లోగా ఆ దరఖాస్తును సంబంధిత శాఖకు బదిలీ చేయాలని స్పష్టం చేశారు. దరఖాస్తులో థర్డ్ పార్టీ సమాచారం కోరినప్పుడు సెక్షన్ 11 నిబంధనలను కచ్చితంగా అనుసరించాలని స్పష్టం చేశారు.

సెక్షన్ 8(1), 8(1)(జె), 8(1)(హెచ్), 8(1)(సి), 8(1)(డి)) కింద కొన్ని రకాల రహస్య సమాచారాలు ఇవ్వడానికి వీలుండదు. అటువంటి సందర్భాలలో 'సెవరబిలిటీ' సూత్రం ప్రకారం, ఇవ్వకూడని సమాచారాన్ని మినహాయించి, మిగిలిన సమాచారాన్ని వేరు చేసి దరఖాస్తుదారునికి అందించాలని తెలిపారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు... సమాచార హక్కు చట్టం అనేది నిర్దేశిత కాలపరిమితితో కూడిన చట్టం, కాబట్టి నిర్ణీత కాలం లోగా దరఖాస్తులను పరిష్కరించడంలో ఎలాంటి ల్యాప్స్ (లోపాలు) ఉన్నా, చట్టప్రకారం కఠిన మైన శిక్షలు, పెనాల్టీలు ఉంటాయని హెచ్చరించారు.

జిల్లాలలో సమాచార హక్కు చట్టం సమర్థవంతంగా అమలు కావడానికి నోడల్ అధికారులుగా ఉన్న ఆర్డీవో లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా కలెక్టర్లు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని కమిషనర్ సూచించారు. పిఐఓ లు, ఫస్ట్ అప్పిలేట్ అథారిటీలు, కమిషన్ అంతా కలిసికట్టుగా పనిచేసి ఈ చట్టాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, ఇన్చార్జి డిఆర్ఓ వై శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాలో పలు ప్రభుత్వ కార్యాలయాల రికార్డుల పరిశీలన. సమాచార కమిషనర్ జిల్లాలో వివిధ కార్యాలయాలలో ఆర్టీఐ అమలు పై రికార్డులను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. ముందుగా జిల్లా కలెక్టర్ కార్యాలయం, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయం, రవాణా శాఖ, జిల్లా విద్యా శాఖ, ఎన్టీఆర్ ఆసుపత్రి, మున్సిపల్ జోనల్ కార్యాలయం, సిపిఓ, డి ఎం సివిల్ సప్లై, ల్యాండ్ సర్వే, ఆర్ డబ్ల్యు ఎస్, ఎండోమెంట్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, జిల్లా పంచాయతీ కార్యాలయాల రికార్డులను పరిశీలించారు.

## జల జీవన్ మిషన్, గ్రామీణ తాగునీటి పథకాల పనులను వేగవంతం చేయాలి.



అధికారులకు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశాలు.

**విశాఖపట్నం, పెన్ సత్తా, జులై 13:** జిల్లాలో జల జీవన్ మిషన్, గ్రామీణ తాగునీటి సరఫరా పథకాలు, 15 వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ సోమవారం తన ఛాంబర్లో సమీక్షించారు. పథకాల అమలులో జాప్యానికి తావులేకుండా నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన తాగునీటి సేవలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 15 వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పథకాల మరమ్మతుల పురోగతి పై అడిగి తెలుసుకున్నారు. మరమ్మతుల పనులను వేగవంతం చేసి, ఎక్కడా తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ తాగునీటి సరఫరా పథకాల నిర్వహణ కోసం ప్రతి పథకానికి ప్రత్యేక బ్యాంకు ఖాతాలు ప్రారంభించి, సేవా రుసుముల వసూళ్లను పారదర్శకంగా నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని డీపీఓకు చెప్పారు. జల జీవన్ మిషన్ కింద చేపట్టిన గృహ తాగునీటి కనెక్షన్ల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న 354 గృహాలకు తాగునీటి కనెక్షన్లు త్వరితగతిన పూర్తి చేసి, నిర్దేశిత గడువులో లక్ష్యాలను సాధించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద పూర్తయిన పనులకు సంబంధించిన ఆస్తుల నమోదు, కంప్యూటరీకరణ తదితర ప్రక్రియలను వెంటనే పూర్తి చేసి, పెండింగ్ అంశాలను సకాలంలో పరిష్కరించాలన్నారు. నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

సమీక్షలో జడ్పీ సీఈవో, ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్.ఈ., ఇరిగేషన్ ఎస్.ఈ., ఏపీడీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జివిఎంసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో 105 వినతులు.

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.



**విశాఖపట్నం, పెన్ సత్తా, జూలై 13:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జీవీఎంసీ లో అన్ని విభాగాలకు కలిపి 105 వినతులు వచ్చాయని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో జివిఎంసి అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, పి నల్లనయ్యలతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 105 అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు.

ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను, ఫిర్యాదులను అదే రోజు జోనల్ స్థాయి అధికారులు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదు దారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీల పై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి జోనల్ కమీషనర్లను, అధికారులను ఆదేశించారు. పురమిత్ర, పిజిఆర్ఎస్ లో నమోదైన పిర్యాదులను కూడా అధికంగా పెండింగ్ లో ఉన్నాయని వాటిని పరిశీలించాలన్నారు. జోనల్ కమీషనర్ లు, జోనల్ అధికారులు నిత్యం మధ్యాహ్నం 3 నుండి 5 వరకు కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ (అమృత్) డి.విజయ భారతి , ప్రధాన ఇంజనీరు సత్యనారాయణ రాజు, సీసీపీ ఏ ప్రభాకరరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి నరేష్ కుమార్, ప్రాజెక్ట్ డైరెక్టర్ (యు సి డి) బి.వి.రమణ, ఎగ్జామినర్ ఆఫ్ ఎకౌంట్స్ సి.వాసుదేవ రెడ్డి, స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ.ఎ.రాజు, పర్యవేక్షక ఇంజనీర్లు, సిటీ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ కుమార్, యుసిడి పి.ఒ- పి.ప్రసన్న వాణి, డిపిఒ జి.నాగార్జునరావు, శాంతి కుమారి, ఫైర్ ఆఫీసర్, డిసిపి లు, ఎసిపి లు బయాలజిస్ట్ సాంబమూర్తి,అన్ని విభాగాల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిలో జరుగుతున్న భూదందాల పై చర్యలు తీసుకోవాలి..





- అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ భూమిని పరి రక్షించాలి..
- భూ ఆక్రమణలకు పాల్పడుతున్న వారి పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి.
- వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కె.కె రాజు.

**విశాఖపట్నం, పెన్ సత్తా, జులై 13:**విశాఖ ఉత్తర నియోజకవర్గం లోని 49 వార్డు మురళీనగర్, కప్పరాడ సర్వే నెం.13 లో ప్రభుత్వ భూముల పై జరుగుతున్న అక్రమ ఆక్రమణలు, భూదందాలు, అమాయక ప్రజలను మోసం చేస్తూ ప్లాట్లు విక్రయిస్తున్న వ్యవహారం పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కి వినతిపత్రం. సోమవారం ఈ విషయమై కలెక్టరేట్ ఆఫీసు గేటువద్ద నిరసన తెలిపి అనంతరం నిరుపేద కాందిశీకుల పోరాట ఐక్య వేదిక ప్రతినిధులుతో కలిసి జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేసిన విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె రాజు. ఈ సందర్భంగా మీడియాతో కె.కె రాజు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి, సంక్షేమం పేరుతో అనేక హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం, అధికారం లోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫల మైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమం, అభివృద్ధి కనిపించకపోగా, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో విలువైన ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించి ప్రైవేట్ వ్యక్తులు, రియల్ ఎస్టేట్ వర్గాలకు లబ్ధి చేకూర్చే పరిస్థితులు నెలకొన్నాయి.
మురళీనగర్ 49 వార్డు, బర్మా కోలని ప్రాంతం లోని సర్వే నెం.13 లో బర్మా కాందిశీకుల భవిష్యత్ అవసరాల కోసం గతంలో ప్రభుత్వం కేటాయించిన సుమారు మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని గత కొన్ని నెలలుగా రాత్రికి రాత్రే ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు వ్యక్తులు ఆ స్థలాలను రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు విక్రయిస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాల పై రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు సమర్థవంతమైన చర్యలు కనిపించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేసిన వారి పైనే బెదిరింపులు, ఒత్తిళ్లు తెస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.
అందువల్ల జిల్లా కలెక్టర్ తక్షణమే సర్వే నెం. 13 లోని అన్ని అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరుతున్నాం. అలాగే భవిష్యత్తులో ఆ భూమి పై ఏవైనా నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తే, అక్కడ నివసిస్తున్న నిజమైన బర్మా కాందిశీకుల అభిప్రాయాన్ని గ్రామసభ ద్వారా తెలుసుకుని, చట్ట బద్ధంగా అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాం. పోలీసు అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లోను కాకుండా ప్రజలకు న్యాయం చేయాలని, భూ ఆక్రమణలకు పాల్పడుతున్న వారి పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. ప్రజాస్వామ్యంలో అధికారులు ప్రజలకు జవాబుదారులుగా పనిచేయాలి తప్ప, ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించకూడదు.
ప్రభుత్వ భూములను పరి రక్షించడం, అమాయక ప్రజలను మోసాల నుంచి కాపాడడం ప్రభుత్వ బాధ్యత. ఈ అంశంలో ప్రభుత్వం వెంటనే స్పందించి అక్రమ ఆక్రమణలను అరికట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు.
ఈ కార్యక్రమంలో 49 వార్డు మాజీ కార్పొరేటర్ అల్లు శంకరరావు, నిరుపేద కాందిశీకుల పోరాట ఐక్య వేదిక ప్రతినిధులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# చేతివృత్తులను ఆదరించండి, హస్త కళలను ప్రోత్సహించండి.







**ఆల్ ఇండియా క్రాఫ్ట్ బజార్ ప్రారంభించిన ఎమ్మెల్యే వెలగపూడి.**

**విశాఖపట్నం, పెన్ సత్తా, జూలై 13:**దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన చేతి వృత్తులను ఆదరించాలని, హస్త కళలను ప్రోత్సహించాలని విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు పిలుపు నిచ్చారు. సోమవారం ఇక్కడ కరక చెట్టు పోలమాంబ ఆలయం వద్ద ఆలిండియా క్రాఫ్ట్ బజార్ ను వెలగపూడి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 రాష్ట్రాలకు చెందిన చేతివృత్తులు, హస్తకళలు, చేనేత వస్తువులు ఉత్పత్తి ధరలకే విక్రయిస్తుండడంతో వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. వినియోగదారులు అందిస్తున్న అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆల్ ఇండియా క్రాఫ్ట్ బజార్ పేరుతో దేశంలోనీ వివిధ ప్రాంతాల్లో లభ్యమయ్యే వస్తువులను ఒకే చోటకు తీసుకువచ్చి ప్రదర్శించడం, విక్రయించడం వల్ల అన్ని వస్తువులను ఒకే చోట సందర్శించి తక్కువ ధరలకు కొనుగోలు చేసే అవకాశం ఉంటుందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ
తక్కువ ధరకు లభ్యమయ్యే ఈ బజార్ ను ప్రజలు ఉచితంగానే తిలకించవచ్చునన్నారు. అలాగే నాణ్యమైన చీరలు గృహోపకరణాలకు అవసరమయ్యే సామగ్రి అంతా ఇక్కడ అందుబాటులో ఉందన్నారు. కావున ఆయా ప్రాంతాల ప్రజలు ఆలిండియా క్రాఫ్ట్ బజార్ ను సందర్శించాలని గంట్ల శ్రీను బాబు కోరారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు విశాఖ ఆర్టీసియన్స్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు మొహమ్మద్ నసీం మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో హైదరాబాద్ నుంచి ముత్యాలు, కలంకారి పెయింట్స్, రాజస్థాన్ బెడ్ షీట్స్, బెంగాల్ కాటన్ సారీస్, కాటన్ డ్రెస్ మెటీరియల్, మైసూర్ రోజ్ వుడ్, తో పాటు అనేక రకాల వస్తువులను అందుబాటులో ఉంచామన్నారు. ఈ ప్రదర్శన ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందన్నారు. తక్కువ ధరకు నాణ్య మైన వస్తువులను కొనుగోలు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో పోలమాంబ ఆలయ దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మద్ది శ్రీనివాస్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ మైనారిటీ విశాఖ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ రహీమతుల్లా తదితరులు పాల్గొన్నారు. వీరంతా తొలుత క్రాఫ్ట్ బజార్ ను సందర్శించి నిర్వాహకులను అభినందించారు. అతిధులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

# రత్నాకర్ జన్మదినం సందర్భంగా ఉచిత వైద్యశిబిరం



**అనకాపల్లి, పెన్ సత్తా, జులై 13:**ఈ నెల 15 బుధవారం తెలుగుదేశం పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ జన్మదినం సందర్భంగా అనకాపల్లి, గవరపాలెం పెదరామ స్వామి యూత్ ఆధ్వర్యంలో అనిల్ నీరుకొండ హాస్పిటల్ తగరపువలస వారి సౌజన్యంతో పెదరామస్వామి కళ్యాణమండపంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి సంబందించిన పాంప్లేట్లను నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ దాడి రత్నాకర్ జన్మదిన సందర్భంగా పేదలకు, పుర ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఈ వైద్య శిబిరం. శిబిరం నందు గుండె సంబంధిత వ్యాధులు, జీర్ణకోసవ్యాధులు, నరాల బలహీనత, కిడ్నీ వ్యాధులు, స్త్రీల ప్రసూతి వైద్యం, పిల్లల వైద్యం, ఎముకలు కీళ్ల వ్యాధుల వైద్యం, కంటి సమస్యలు, చెవి ముక్కు గొంతు సమస్యలు, ఊపిరితిత్తుల వ్యాధులు, చర్మవ్యాధులు, మానసిక సమస్యలు, దంత చికిత్స, ఇతర వైద్య సమస్యలను ప్రముఖ వైద్యులచే పరీక్షలు చేయబడును. ఈసీజీ, షుగర్, బిపి, కంటికి సంబంధించిన అన్ని రకాల పరీక్షలు, కంటి ఆపరేషన్ అవసర మైన వారికి ఆరోగ్యశ్రీ పై ఉచిత కంటి ఆపరేషన్లు, మొదలగు పరీక్షలు ఉచితంగా చేసి అవసర మైన మందులు ఉచితంగా ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ పరీక్షల కోసం ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీని తీసుకొని రావలసి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొణతాల సత్యనారాయణ, బొడ్డేడ శంకర్రావు, కర్రీ చిన్న అప్పల నాయుడు, కర్రీ అప్పాజీ, కొణతాల గోపికృష్ణ, కోరుబిల్లి ఆరుద్ర, కోరిబిల్లి పర్రి, శిలపరశెట్టి బాబి, దాడి ఈశ్వర రావు, రేభక మధు, దొడ్డి రమణ, పొలిమేర నాయుడు, ఆళ్ల ప్రవీణ్ కుమార్, పోలమరిశెట్టి శివ అప్పారావు, సూరిశెట్టి బంగారు నాయుడు, కొలతల పరదేశి నాయుడు, ఆడారి రవికుమార్, అన్నం రాజశేఖర్, పోసర్ల రాజా, తాటికొండ జీవన్, తదితరులు పాల్గొన్నారు.

# 16 వ తేదిన జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవం.



**అనకాపల్లి, పెన్ సత్తా, జులై 13**: సుభద్ర బలభద్ర సమేత జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవం ఈ నెల 16 వ తేదీ గురువారం గవరపాలెం జగన్నాధస్వామి ఆలయం నుంచి ఉదయం 9.10 గంటలకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎంపీ సీఎం రమేష్ చేతులమీదుగా తొలి రథయాత్ర ప్రారంభించ బడునని ఆలయ చైర్మన్ దాడి బుజ్జి తెలిపారు. ఈ సందర్భంగా గవరపాలెం జగన్నాధస్వామి ఆలయంవద్ద జరిగిన విలేకరుల సమాశంలో బుజ్జి మాట్లాడుతూ 17 వ తేదీ నుంచి గూడ్స్ రోడ్డు వద్ద గల ఇంద్రజ్యుమ్న హాలు వద్ద దశావతారము అలంకరణ, 25 వ తేదీ శనివారం వరకు జగన్నాథ స్వామి దర్శనాలు కల్పించ బడునని తెలిపారు. ఈ తొమ్మిది రోజులపాటు ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇంద్రజ్యుమ్న హాలు నందు ప్రత్యేక ఆకర్షణగా శ్రీకృష్ణుని అవతారంలో జగన్నాధులు భక్తులకు దర్శనం ఇస్తారని తెలిపారు. జగన్నాథ స్వామి రథయాత్ర మహోరీత్సవాలను మాజీ మంత్రి దాడి వీరభద్ర రావు, ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవిందు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి భీమరశెట్టి రాంకీ, జిల్లా బీజేపీ అధ్యక్షులు, ద్వారపురెడ్డి పరమేశ్వర రావు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్నీ బాలాజీ ల సహకారంతో రథయాత్రను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ఉంటాయని రథయాత్రలో పెదరామ సేవ గరిడీ సంఘం తాడుపెద్దు సేవ, ఆర్.శివరాంపురం తప్పెడుగుళ్లు, పులివేషాలు, తీన్ మార్ వంటి కార్యక్రమలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో కె చంద్రతేజ, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరి, దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ వసంత కుమార్, ఆలయ ధర్మకర్తలు యల్లబిల్లి ధనలక్ష్మి, కాండ్రేగుల వెంకటరావు, బుద్ధ అదిలక్ష్మి అప్పారావు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ఛాంపియన్స్ గా “సోమేశ్”.





**పెన్ సత్తా, జులై 13::**శ్రీకాకుళం జిల్లాలో ఈ నెల 11,12 తేదీలో జరిగిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు మెన్స్ విభాగములో కవిటి గ్రామానికి చెందిన “గోపిల్లి.సోమేశ్” సింగిల్స్ లో ఛాంపియన్ గా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు.అలాగే గోపిల్లి సోమేశ్(కవిటి)ఢరేవంత్(పలాస) జంటడబుల్స్ ఛాంపియన్లు గాను, మరియు మాడుగుల.శేష(కవిటి)ఢ అభిరామ్(శ్రీకాకుళం)జంటరన్నర్సగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లాబ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మరియు కవిటి ఉషోదయ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు తమరాల.జయరామ్ పేర్కొన్నారు.గెలుపొందిన క్రీడాకారులు ఆగస్టు 2నుండి 5వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరుగు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. జిల్లాస్థాయి పోటీలు సింగిల్సఢ డబుల్స్ విభాగాలలో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయిలో విజేతగా నిలిచిన కవిటి గ్రామానికి చెందిన గోపెల్లి సోమేస్ కు,అలాగే రన్నర్ గా నిలిచిన మాడుగుల శేష మరియు ఇతర క్రీడాకారులకు స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బెందాళం. అశోక్,ఉషోదయ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ పాట్రన్ మరియు కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల. రాజేష్,ఉషోదయ గౌరవాధ్యక్షులు బెందాళం. చిట్టిబాబు,మాజీ జడ్పిటిసి సభ్యులు బెందాళం.రమేష్, మాజీ సర్పంచులు పాండవ.శేఖర్, ఆరింగి.మధు,పూడి.అబ్బాయి, బెందాళం.వెంకటేశ్వరరావు,ఉషోదయ అధ్యక్ష - కార్యదర్శులు ఆరంగి కృష్ణారావు,పోల్లాయి.రుద్రయ్య అభినందించారు.

# తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సమాచార హక్కు చట్టం కమిషనర్ .



**పెన్ సత్తా, జులై 13:**స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం అమలు రికార్డుల పనితీరును రాష్ట్ర ఆర్టిఐ కమిషనర్ పిఎస్ నాయుడు సోమవారం పరిశీలించారు. కార్యాలయానికి చేరుకున్న ఆర్టిఐ కమిషనర్ నాయుడుకు తాసిల్దార్ పీవీరత్నం ,డిప్యూటీ తాసిల్దార్ అరుణ్ కుమార్ లు స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయంలో నిర్వహిస్తున్న సమాచార హక్కు చట్టం రిజిస్టర్ లను, రికార్డులను కమిషనర్ నాయుడు స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండల కార్యాలయంలో సమాచార హక్కు చట్టం సక్రమంగా అమలు జరిగే విధంగా తాసిల్దార్, డిప్యూటీ తాసిల్దారులతో పాటు సిబ్బంది కూడా చూడాలని ఆదేశించారు.

# జగన్ రెడ్డీ.. నీ ఐదేళ్ల పాలనలో మత్స్యకారులకు ఏం ఉద్ధరించావ్.

**శవం కనిపిస్తే చాలు రాబందుల్లా వాలిపోవడానికి వైసీపీ నేతలు సిగ్గుపడాలి.**

**విశాఖ పడవ ప్రమాదం బాధితులతో రాజకీయం చేయాలనుకుంటే గుణపాఠం తప్పదు.**

**రాష్ట్ర మత్స్యకార సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి చింతకాయల ముత్యాలు.**

**పరవాడ, పెన్ సత్తా, జులై 13:** విశాఖపట్నం నుంచి సముద్రం లోకి చేపల వేటకు వెళ్లి మత్స్యకారులు మృత్యువాత పడటం అత్యంత బాధాకరం అని రాష్ట్ర మత్స్యకార సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి చింతకాయల ముత్యాలు విచారం వ్యక్తం చేశారు. సోమవారం చింతకాయల ముత్యాలు పత్రికా ప్రకటన ద్వారా వివరాలు తెలిపారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేసిందన్నారు.

దాదాపు 14 గంటల పాటు సముద్రంలో ఈత కొట్టి బయటపడిన కారె చిన్నాకు ప్రభుత్వం నుండి త్వరలోనే పడవ ఇప్పిస్తామని భరోసా ఇచ్చాం అని తెలిపారు. ఇలాంటి దురదృష్టకర సమయంలో వైసీపీ నేతలు రాజకీయం చేయడం సిగ్గుచేటు అన్నారు. గత

ఐదేళ్లు అధికారంలో ఉన్న జగన్ రెడ్డి మత్స్యకారుల్ని ఏ నాడైనా కనీసం పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు.

రైతు భరోసా, వాహన మిత్ర లాంటి పథకాలు అందితే, మత్స్యకార భరోసా ఇవ్వమని జీవో నెం.30 లో పేర్కొన్నారు.

ఐదేళ్ల పాలనలో సుమారు 63 మంది మత్స్యకారులు సముద్రంలో గల్లంతయ్యారు. బీమా రూ.10 లక్షలకు పెంచుతామని ప్రకటించిన జగన్ రెడ్డి ఐదేళ్లలో ఏ ఒక్కరికీ పైసా అందించలేదు.

చనిపోయిన వారికి డెత్ సర్టిఫికెట్లు కూడా జారీ చేయకుండా వారి కుటుంబాలను రోడ్డుపాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2023 లో విశాఖ హార్బర్ అగ్ని ప్రమాదం జరిగి సుమారు 45 మరబోట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి, 15 పడవలు కొంత మేర కాలిపోయి సుమారు రూ.50 కోట్ల నష్టం జరిగితే జగన్ ఏం సాయం చేశారు? అని ఏద్దేవా చేశారు. తెలుగుదేశం పార్టీ పడవకు రూ. లక్ష చొప్పున, పవన్ కల్యాణ్ రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం చేశారన్నారు. జగన్ జీవో నెం.217 తో మత్స్య కారులకు దశాబ్దాలుగా చెరువులు, రిజర్వాయర్ల పై ఉన్న హక్కుల్ని కాలరాసి, తమ వారికి చెరువులు రిజర్వాయర్లను కట్టబెట్టాలని ప్రయత్నించాడు అన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతి టీడీపీ హయాం లోనే : కూటమి అధికారం లోకి రాగానే వైసీపీ హయాంలో మరణించిన 63 మంది మత్స్యకారులకు రూ.5 లక్షల చొప్పున రూ.3.15 కోట్లు బీమా చెల్లించారన్నారు. జగన్ రెడ్డి దుర్మార్గంగా తీసుకొచ్చిన జీవో నెం. 217 రద్దు చేసి మత్స్యకారుల హక్కుల్ని కాపాడాం అని ముత్యాలు తెలిపారు. వేట నిషేధ సమయంలో మత్స్య కారులకు భృతి, 50 సంవత్సరాలకే పెన్షన్ అందించిన ఘనత టీడీపీ దేనన్నారు. 4 లక్షల మంది మత్స్యకారులకు గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీంలో చేర్చి ఆర్థిక భద్రత కల్పించాం. మత్స్యకారులకు నాణ్య మైన చేపపిల్లలు ఇచ్చేందుకు బాపట్లలో రూ.20 కోట్లతో భారీ హేచరీ నిర్మించారు.

వేటకు వెళ్లి మరణించిన వారికి 15 రోజుల్లో డెత్ సర్టిఫికెట్, 30 రోజుల్లో రూ.5 లక్షల బీమా అందించాం.

2014-19 మధ్య కాలంలో 17 వేల పడవలకు డీజిల్ సబ్సిడీ అందించాం.

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో మత్స్య కారుల పిల్లల కోసం ప్రత్యేకంగా ఆరు రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభించిన ఘనత చంద్రబాబు ఆధ్వర్యంలో తెలుగుదేశం ప్రభుత్వానిదే.

తెలుగుదేశం ప్రభుత్వం పడవలు, వలలు, ఐస్ బాక్సులు 75 శాతం సబ్సిడీతో ఇచ్చి అండగా మత్స్యకారులకు అండగా నిలిచింది. హుధుద్ తుపానుతో దెబ్బతిన్న 2,784 హెక్టార్ల ఆక్వా ఫామ్స్ రైతులకు, 3,867 పడవలు, 4,471 వలలు గల్లంతైతే అందరికీ ఉచితంగా పడవలు, వలలు అందించడం జరిగింది.

దెబ్బతిన్న పడవల మరమ్మతులు, వలలు కోల్పోయిన వారికి రూ.17.06 కోట్ల పరిహారాన్ని అందజేశాము.

హుధూద్ తుపానుతో నష్టపోయిన వారి కోసం కట్టిన ఇళ్లను కూడా ఇవ్వకుండా జగన్ రెడ్డి నాశనం చేశాడు

శవం కోసం గోతి దగ్గర నక్కలా జగన్ రెడ్డి ఎదురు చూపులు. ఎప్పుడు, ఎక్కడ ఎవరి శవం దొరుకుతుందా, రాజకీయం చేద్దామా అనేది జగన్ ఆలోచనే తప్ప, ప్రజా ప్రతినిధిగా ప్రజలకు అండగా నిలవాలనే కనీస ఇంగితం కూడా జగన్ రెడ్డికి లేకుండా పోయిందన్నారు.

తండ్రి శవంతో రాజకీయాల్లోకి వచ్చిన జగన్ రెడ్డి, బాబాయి శవాన్ని వాడుకుని సీఎం అయిపోయాడని ఆరోపణలు చేశారు. మొన్నటి ఎన్నికల్లో గులక రాయి డ్రామా ప్రజలు గమనించి 11 సీట్ల బలమైన తీర్పుతో బుద్ధి చెప్పారు.

అయినప్పటికీ.. కుక్క తోక వంకరే అన్నట్లుగా.. క్రిమినల్ మైండెడ్ జగన్ రెడ్డి ఇంకా శవాలతో ఆడుతున్నాడు. వేటకు వెళ్లిన వారు ఏమయ్యారో తెలియక వారి కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతుంటే, ప్రభుత్వం తన వంతు బాధ్యతగా ఆర్థిక సాయం అందించి అండగా నిలిచింది. ఈ విషయాన్ని కూడా రాజకీయం చేయడానికి జగన్ రెడ్డి ప్రయత్నించడం సిగ్గుచేటు.

మత్స్యకారులకు అండగా నిలిచే లక్ష్యంతో తీసుకొచ్చిన అనేక సంక్షేమ పథకాలు రద్దు చేశారు. ఎన్ఎఫ్డిబి, పిఎంఎమ్ఎస్వై లాంటి పథకాల ద్వారా కేంద్రం ఇచ్చే నిధులకు రాష్ట్ర వాటా ఇవ్వకుండా దగా చేశాడు. మత్స్యకార కార్పొరేషన్ ద్వారా 75 శాతం సబ్సిడీతో వలలు, పడవలు, ఇతర పనిముట్లు అందించే మహత్తర మైన పథకాలను సైతం జగన్ నిలిపివేశారు. 10 ఫిషింగ్ హార్బర్లు



నిర్మిస్తున్నామని ఆర్భాటంగా ప్రకటించిన జగన్ రెడ్డి ఐదేళ్లలో ఒక్కటీ పూర్తి చేయలేదు. వైసీపీ ప్రభుత్వ చేతకానితనం కారణంగా రాష్ట్ర ఆక్వారంగం పూర్తిగా కుదేలైపోయింది.

చివరికి తమ రాజకీయ ప్రాబల్యాన్ని కాపాడు కోవడానికి చీరాల ప్రాంతం లోని మత్స్యకార గ్రామాల మధ్య కూడా చిచ్చు పెట్టిన నీచ సంస్కృతి వైసీపీ నేతలది.

ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు కులం, మతం, ప్రాంతం పేరుతో రాజకీయాలు చేసిన జగన్ రెడ్డి. అధికారం కోల్పోయిన రోజు నుండి శవాలు ఎక్కడ దొరుకుతాయా రాజకీయం చేద్దామా అన్నట్లు వ్యవహరిస్తున్నాడు.

మత్స్యకారులు గల్లంతయ్యారన్న సమచారం అందుకున్న క్షణం నుండి మత్స్యశాఖ అధికారులు, జిల్లా యంత్రాంగం, ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షిస్తూనే ఉన్నారు.

హోం మంత్రి, మత్స్య శాఖ మంత్రి ఘటన జరిగిన వెంటనే విశాఖపట్నం కలెక్టరేట్లో అధికారులతో సమీక్షించి పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు.

ప్రమాదం జరిగిన వారం తర్వాత జగన్ రెడ్డి విశాఖపట్నం వచ్చి రాద్ధాంతం చేయాలని చూస్తున్నాడు. ఒక ప్రజా ప్రతినిధిగా ఏ రోజు కూడా జగన్ మనుషుల గురించి ఆలోచించలేదు, వారి బాగోగుల్ని పట్టించు కోలేదు. కనీసం ఒక మనిషిగా అయినా జగన్ రెడ్డి ఆలోచించి ప్రవర్తిస్తే బాగుంటుంది. అలా కాకుండా ప్రతి చోటా రాజకీయం చేస్తా, ప్రతి విషయాన్ని రచ్చ చేస్తా, అనుకుంటే ప్రజలంతా ఏకమై జగన్ రెడ్డికి మరోసారి ప్రజలు తమ ఓటుతో సన్మానం చేయడం తథ్యం. ఇప్పటి కైనా సాటి మనిషిగా వ్యవహరించడం నేర్చుకోవాలని జగన్ రెడ్డి ని ముత్యాలు హెచ్చరిస్తున్నాం అన్నారు.

## విద్యా మాఫియాపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

- రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ డిమాండ్



**రాజమహేంద్రవరం, పెన్ సత్తా, జులై 13::**రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, రవాణా పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థికంగా దోచుకుంటున్నాయని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ ఆరోపించారు. ఆర్యాపురంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన వారాంతపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి ప్రైవేట్ పాఠశాలలో యాజమాన్యమే నిర్వహించే దుకాణాల ద్వారా పుస్తకాలు, నోట్‌బుక్స్, విద్యా సామగ్రిని అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనేక విద్యాసంస్థలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రతి పాఠశాలలో పేరెంట్స్--టీచర్స్ కమిటీలు సమర్థంగా పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలో రెండు రకాల బిల్లులు నిర్వహిస్తూ అక్రమాలకు పాల్పడు తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యా యులకు కనీస వేతనాలు కూడా చెల్లించడం లేదని, వారి శ్రమను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ వ్యవస్థలో నష్టపోతు న్నారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు (డీఈవోలు) ప్రైవేట్ విద్యాసంస్థలపై నిరంతరం తనిఖీలు నిర్వహించి నిబంధనలు అమలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని, అక్రమాలకు పాల్పడే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా సంస్థల దోపిడీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై సమగ్ర , శాఖపర తనిఖీలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యామాఫియాను నియంత్రించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వానికి, టీడీపీకి వ్యతిరేకంగా మాట్లాడలేదు యార్లగడ్డ వెంకట్రావు.

- కార్యకర్తల ఆవేదనను మాత్రమే వ్యక్తం చేశా యార్లగడ్డ.
- ఎయిర్‌పోర్టు టెండర్‌లో నా ప్రమేయం నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా యార్లగడ్డ.
- సాక్షి తప్పుడు ప్రచారం చేస్తోంది..
- ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా యార్లగడ్డ.
- ఎయిర్‌పోర్టు అడ్వైజరీ కమిటీలో ప్రజా ప్రతినిధిగా ప్రశ్నించా యార్లగడ్డ.
- ప్రత్యర్థులకు ప్రభుత్వ పనులు వెళ్లడం పై కార్యకర్తల్లో ఆవేదన ఉంది యార్లగడ్డ.
- టీడీపీ కోసం పోరాడిన కార్యకర్తలకు న్యాయం జరగాలి యార్లగడ్డ.
- విజయ డెయిరీ వ్యవహారం పై సమగ్ర విచారణ జరపాలి యార్లగడ్డ.
- జులై 17 న ఉచిత ఏఐ--ఎంఎల్ శిక్షణ కేంద్రం ప్రారంభం.



**గన్నవరం, పెన్ సత్తా, జులై 13:**

తాను ఇటీవల చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వం లేదా తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా కాదని, పార్టీ కోసం కష్ట పడ్డ కార్యకర్తల ఆవేదనను మాత్రమే వ్యక్తం చేశానని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలను వక్రీకరించి కొందరు యూట్యూబ్ ఛానళ్లు, సాక్షి మీడియా తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. సోమవారం విజయవాడ తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎయిర్ పోర్టు టెండర్ వ్యవహారంలో తన మనిషికి కాంట్రాక్ట్ ఇప్పించాలని ప్రయత్నించానంటూ సాక్షి పత్రిక, అనుబంధ మాధ్యమాలు చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని ఖండించారు. తాను ఏ కంపెనీకి టెండర్ ఇప్పించాలని ఒత్తిడి తెచ్చానని లేదా సిఫార్సు చేశానని నిరూపిస్తే ఐదు నిమిషాల్లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని బహిరంగ సవాల్ విసిరారు. ఎయిర్ పోర్టు అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్‌గా రెండు సంవత్సరాల తర్వాత జరిగిన సమావేశానికి హాజరయ్యానని, ఆ సమావేశం లోనే మిగిలిన పనులకు టెండర్ ఇవ్వడం, వ్యయం పెరగడం వంటి అంశాలు చర్చకు వచ్చాయని చెప్పారు. విజయవాడ, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు కూడా దీని పై ప్రశ్నలు అడిగారని, ప్రజాధనం ఖర్చు అవుతున్నప్పుడు ప్రజా ప్రతినిధిగా వివరాలు అడగడం తన బాధ్యతేనని అన్నారు. దీనిని ప్రభుత్వం వ్యతిరేక వ్యాఖ్యలుగా చిత్రీకరించడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం పై అసంతృప్తి ఉంటే నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే చెబుతానని, డొంకతిరుగుడు రాజకీయాలు తనకు తెలియవని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని ఉద్దేశించి యార్లగడ్డ పలు వ్యాఖ్యలు చేశారు. ఎన్టీఆర్ కుటుంబాన్ని దూషించిన వారిని జగన్ ఖండించి ఉంటే ఆయన రాజకీయ స్థాయి మరింత పెరిగేదన్నారు. బూతులు మాట్లాడే నాయకులను ప్రోత్సహించడం వల్లే వైఎస్సార్‌సీపీ నష్టపోయిందని, ఇప్పటికైనా అలాంటి వారిని దూరం పెట్టాలని జగన్‌కు హితవు పలికారు. కొడాలి నాని గతంలో మాట్లాడిన తీరు, ఇప్పుడు మాట్లాడుతున్న తీరు భిన్నంగా ఉందని, ఒకే ధోరణితో మాట్లాడితేనే ప్రజలు నమ్ముతారని వ్యాఖ్యానించారు. జగన్‌ను తప్పుదోవ పట్టించింది ఈ జిల్లా మాజీ మంత్రులేనని ఆరోపించారు.

సాక్షి పత్రిక పై తీవ్ర విమర్శలు చేసిన యార్లగడ్డ, తాను వైఎస్సార్‌సీపీలో ఉన్నప్పుడు కూడా వ్యక్తిగత దూషణలను సమర్థించలేదని చెప్పారు. సాక్షి చైర్‌పర్సన్ వైఎస్ భారతి గురించి అనుచితంగా మాట్లాడిన వారినే తర్వాత పార్టీలో చేర్చుకున్నారని గుర్తు చేశారు. తన పై తప్పుడు కథనాలు ప్రచురించడం మానుకోవాలని, నిజాలు రాస్తేనే ప్రజలు నమ్ముతారని సూచించారు. తాను రాజకీయాల్లో వ్యక్తిత్వాన్నే ముఖ్యంగా భావిస్తానని, వ్యక్తిగత లాభాల కోసం ఎప్పుడూ వ్యవహరించలేదని అన్నారు.

గన్నవరం నియోజకవర్గంలో పార్టీ కోసం ఐదేళ్లపాటు పోరాడిన కార్యకర్తలు, కేసులు ఎదుర్కొన్న వారు, పార్టీ కార్యాలయం దాడి ఘటనలో జైలుకు వెళ్లిన వారిలో తీవ్ర ఆవేదన ఉందన్నారు. లోకేష్ పాదయాత్ర సమయంలో పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలే ఇప్పుడు తమ సమస్యలను తన వద్దకు తీసుకొస్తున్నారని చెప్పారు. ప్రత్యర్థులతో సంబంధాలు ఉన్న వారికి ప్రభుత్వ పనులు, కాంట్రాక్టులు దక్కుతున్నాయనే కార్యకర్తల అభ్యంతరాలను మాత్రమే పార్టీ దృష్టికి తీసుకెళ్లానని, అది పార్టీ వ్యతిరేక చర్య కాదన్నారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, వారి మనోభావాలను పట్టించు కోవాల్సిన అవసరం ఉందన్నారు. వల్లభనేని వంశీ అనుచరుడిగా ఉన్న కడియాల సతీష్‌కు చెందిన బాబు ఎంటర్ ప్రైజెస్‌కు ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంబంధించిన పనుల్లో రూ.8 కోట్ల చెల్లింపులు జరిగాయని ఆరోపించారు. ఈ అంశాన్ని ప్రశ్నించడం తప్పా అని నిలదీశారు. ప్రత్యర్థులకు దగ్గరగా ఉన్న వ్యక్తులకు ప్రభుత్వ పనులు వెళ్లడం పై కార్యకర్తల్లో అసంతృప్తి ఉందని, అదే విషయాన్ని తాను ప్రస్తావించానన్నారు. గన్నవరంలో అక్రమ మట్టి వ్యాపారాలకు తాను ఎప్పుడూ వ్యతిరేకినేనని, ఇళ్ల స్థలాలకు అవసరమైన మట్టిని ఉచితంగా అందించిన విషయాన్ని గుర్తు చేశారు.

విజయ డెయిరీలో అక్రమాలు, నిధుల దుర్వినియోగం పై రైతులు, కార్యకర్తల నుంచి అనేక ఫిర్యాదులు వచ్చాయని యార్లగడ్డ తెలిపారు. డెయిరీ నిధుల వినియోగం, ప్రకటనల ఖర్చులు, పాలకవర్గం వ్యవహారశైలి పై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో కూడా ప్రస్తావించానని, ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తుందనే నమ్మకం ఉందన్నారు.

చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు సమయంలో రోడ్లపైకి వచ్చి పోరాడిన కార్యకర్తలే ఇప్పుడు తమ బాధను వ్యక్తం చేస్తున్నారని యార్లగడ్డ అన్నారు. లోకేష్ పాదయాత్ర సమయంలో కనిపించని వారు ఇప్పుడు పార్టీలో కీలక స్థానాల్లో ఉండటం పై కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాల మేరకే ముందుకు వెళ్తామని తెలిపారు. రాష్ట్రంలో సాంకేతిక రంగంలో యువతకు అవకాశాలు కల్పించేందుకు హెచ్‌సీఎల్ ఫౌండేషన్ సహకారంతో పీ-4 కార్యక్రమం కింద ఈ నెల 17 న ఉచిత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు యార్లగడ్డ వెల్లడించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు.

## నేడు ఈఎస్ఐసీ 100 పడకల ఆసుపత్రి వర్చువల్ ప్రారంభం

ప్రాంతీయ సంచాలకులు మల్లా రామారావు



**పెన్ సత్తా, జులై 13:**భారత ప్రభుత్వ కార్మిక , ఉపాధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కార్మిక రాజ్య బీమా సంస్థ ఆధ్వర్యంలో నిర్మితమైన 100 పడకల ఈఎస్ఐసీ ఆసుపత్రిని మంగళవారం కేంద్ర కార్మిక ఉపాధి శాఖ మంత్రి, యువజన వ్యవహారాలు క్రీడల శాఖ మంత్రి మనసుఖ్ మాండవ్య వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐసీ డైరెక్టర్ జనరల్ అశోక్ కుమార్ సింగ్ తోపాటు పలువురు అధికారులు పాల్గొంటారనీ ఈ ఎస్ ఐ ప్రాంతీయ సంచాలకులు మల్లా రామారావు సోమవారం తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రిలో నూతన ఓపీడీ బ్లాక్‌ను ప్రత్యక్షంగా ప్రారంభించడంతో పాటు, ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరం 100 పడకల ఈఎస్ఐసీ ఆసుపత్రి, తమిళనాడులోని శ్రీపెరుంబుదూర్ ఆసుపత్రి, అస్సాంలోని బెల్టోలా ఆసుపత్రి అప్‌గ్రేడ్, రాజస్థాన్‌లోని కోటా, భావానీమండి, గుజరాత్‌లోని సురేంద్రనగర్ ఈఎస్ఐ డిస్పెన్సరీలు, బ్రాంచ్ కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

శ్రీరామ్ నగర్ ప్రాంగణంలో ఈఎస్ఐ హాస్పిటల్, శ్రీరామ్ నగర్ ప్రాంగణశీ లో మధ్యాహ్నం 3.00 గంటలకు వర్చువల్ ప్రారంభోత్సవన్ నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్, స్థానిక శాసన సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు , కార్మిక సంఘాల ప్రతినిధులు, ఈఎస్ఐ లబ్ధిదారులు, యజమానులు, సంబంధిత శాఖల అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమం లో ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
ప్రశ్నించడం అందరి హక్కు..
PEN SATTA Telugu Daily
మంగళవారం 14 జూలై 2026

## సంపాదకీయం

## క్వాంటం కేతనం!

రెండు సంఖ్యలను కూడమంటే తడబడే యంత్రం, విశ్వ రహస్యాలను మాత్రం అలవోకగా విప్పుతుంది.. ఇదెక్కడి వింత అనిపించవచ్చు. కానీ క్వాంటం కంప్యూటింగ్ ప్రపంచపు నిజస్వరూపం ఇదే. వందల రూపాయల కాలిక్యులేటర్ క్షణంలో చేసే సాధారణ కూడికను క్వాంటం కంప్యూటర్‌తో చేయించడం మహా కష్టమని, అదే సమయంలో పరస్పరం ప్రభావితం చేసుకునే కణాలతో నిండిన అత్యంత సంక్లిష్ట క్వాంటం వ్యవస్థను అనుకరించడం దానికి సులభమని బిట్స్ పిలానీ భౌతికశాస్త్ర ప్రొఫెసర్ ఇంద్రాక్షి రాయ్‌చౌధురి చమత్కరిస్తారు. క్వాంటం యంత్రాలు సంప్రదాయ కంప్యూటర్లను నిజంగా ఎక్కడ మించగలవో కనిపెట్టడమే నేడు ప్రపంచ దేశాలు, కార్పొరేట్ దిగ్గజాలు వేల కోట్లు కుమ్మరిస్తున్న అసలు సవాలు. ఎందుకంటే ఈ రంగం చుట్టూ ఉన్న ప్రచార ఆర్భాటానికీ, క్షేత్రస్థాయి వాస్తవానికీ మధ్య అగాధం చిన్నదేమీ కాదు. దశాబ్దాల పరిశోధన, బిలియన్ డాలర్ల పెట్టుబడుల తర్వాత కూడా, నిజంగా ఉపయోగపడే ఒక్క సమస్యనూ క్వాంటం యంత్రాలు సాధారణ కంప్యూటర్ల కంటే వేగంగా పరిష్కరించలేకపోయాయన్నది కఠోర సత్యం! సూపర్ కంప్యూటర్‌కు పదివేల సంవత్సరాలు పట్టే పనిని తమ ప్రాసెసర్ నిమిషాల్లో పూర్తి చేసిందని 2019లో గూగుల్ ఘనంగా ప్రకటించినా, ఆ 'పని'కి ఎలాంటి ఆచరణాత్మక ప్రయోజనమూ లేదు; కేవలం క్వాంటం హార్డ్‌వేర్‌కు అనుకూలమనే దాన్ని ఎంచుకున్నారు. అందుకే ఈ రంగం ఇప్పుడు ఆడంబరాల నుంచి వాస్తవికత వైపు మళ్లి, స్వతంత్రంగా సరిచూడగలిగే నిజమైన సమస్యపై సాధించే 'ఉపయోగకరమైన ఆధిక్యం' (యూజ్‌ఫుల్ అడ్వాంటేజ్) అనే నికార్సయిన లక్ష్యాన్ని వెంబడిస్తోంది. సరిగ్గా ఇక్కడే భారత శాస్త్ర పతాక ఒకటి సగర్వంగా రెపరెపలాడింది. రాయ్‌చౌధురి బృందం ఐబీఎం క్వాంటం శాస్త్రవేత్తలతో కలిసి, 120 క్యూబిట్‌లపై పరమాణు అంతర్గత కణాల ప్రవర్తనను అనుకరించి చూపింది. సంప్రదాయ కంప్యూటర్‌కు రెండు గంటలుపట్టే ఆ గణనను క్వాంటం యంత్రం కేవలం 20 సెకన్లలో పూర్తి చేసింది. భౌతిక శాస్త్రవేత్తలకు ఉపయోగపడుతూ, సంప్రదాయ కంప్యూటర్ల శక్తికి లొంగకుండా నిలిచిన సమస్యలు ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు మూడంటే మూడే ఉన్నాయని నిపుణుల అంచనా. వాటిలో ఒకటి భారత గడ్డపై పుట్టిన పరిష్కారం కావడం చరిత్రాత్మకం.

ఈ విజయపు లోతు తెలియాలంటే, ఆ బృందం ఎంచుకున్న సమస్య స్వభావాన్ని అర్థం చేసుకోవాలి. ప్రోటాన్ లోపలి క్వార్క్‌లు, వాటిని బంధించి ఉంచే గ్లువాన్‌లు ప్రకృతిలోకెల్లా బలమైన శక్తి అయిన 'స్ట్రాంగ్ న్యూక్లియర్ ఫోర్స్' పాలనలో నడుస్తాయి. ఆ కణాలు క్షణక్షణం ఎలా కదులుతాయో, ఎలా పునర్వ్యవస్థీకృతమవుతాయో లెక్కించడం ఫిజిక్స్‌లోని క్లిష్ట సమస్యల్లో ఒకటి. సంప్రదాయ పద్ధతులు ప్రోటాన్ ద్రవ్యరాశిని కచ్చితంగా చెప్పగలవుగానీ, కణాల పరిణామాన్ని ఫ్రేమ్ తర్వాత ఫ్రేమ్ చూడాలంటే మాత్రం గణన సంక్లిష్టత ఘాతీయంగా పెరిగిపోయి చేతులెత్తేస్తాయి. నిశ్చల ఛాయాచిత్రం స్థానంలో సజీవ చలనచిత్రాన్ని చూపగల సత్తా క్వాంటం కంప్యూటర్‌కే ఉంది. ఆ సత్తాను రాబట్టేందుకు ఈ బృందం, బలమైన శక్తి పూర్తి సిద్ధాంతానికి సరళీకృత ప్రతిరూపమైన నమూనాను తీసుకుని, గణిత పునరుక్తులను తొలగించే వినూత్న 'ఎన్‌కోడింగ్'ను రూపొందించింది. ఫలితంగా ఇతరులు గరిష్ఠంగా 27 క్యూబిట్‌లపై నడిపిన సమస్య ఏకంగా 120 క్యూబిట్‌ల స్థాయికి విస్తరించింది.

'ఈరోజు నాకు వెయ్యి క్యూబిట్‌ల కంప్యూటర్ ఇస్తే, మా అల్గారిథం నిరాటంకంగా దానికి సరిపోతుంది' అన్న రాయ్‌చౌధురి మాటల్లో ధీమా అంతా ఆ పునాది పటిష్ఠతదే. మరో విశేషం -ఈ ఫలితం నిగ్గుతేలిన తీరు. క్వాంటం ఆధిక్య ప్రకటనల్లో నీరెంతో, పాలెంతో తేల్చడానికి 2025 నవంబర్‌లో ఐబీఎం, ఫ్లాటిరాన్ ఇన్‌స్టిట్యూట్, పలు అంకుర సంస్థలు, విద్యావేత్తలు కలిసి 'క్వాంటం అడ్వాంటేజ్ ట్రాకర్' (క్యూఏటీ) అనే సజీవ సమీక్షా వేదికను ప్రారంభించారు. పరిశోధకులు సమర్పించే ప్రతి ఫలితాన్నీ ఒక కమిటీ సంప్రదాయ, క్వాంటం యంత్రాలు రెండింటిపైనా పరీక్షిస్తుంది. ఇప్పటివరకు నమోదైన సుమారు 220 ఎంట్రీలలో ఆమోదం పొందినవి డజను లోపే. అలాంటి కఠిన వడపోతలో ఈ బృందం ఫలితం 'యాక్టివ్' హోదాతో నిలబడింది. ఒక భారతీయ ప్రయోగశాల నుంచి ఈ ఘనత సాధించిన తొలి ఫలితం ఇదే. మే నుంచి ఇప్పటివరకు ఏ సంప్రదాయ కంప్యూటరూ దాన్ని అధిగమించలేకపోయింది. ప్రపంచంలోనే అతిపెద్ద కణ పరిశోధనా కేంద్రమైన సెర్న్ (స్విట్జర్లాండ్) శాస్త్రవేత్తలు, తమ అనుకరణలను ముందుకు తీసుకెళ్లగలరేమో చూడమని ఆమెను ఆహ్వానించడం భారత మేధకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపునకు తార్కాణం.

అయితే ఈ విజయోత్సాహపు వెలుగులో దేశం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన కోణాలూ ఉన్నాయి. 2023లో ఆమోదం పొందిన రూ.6,003 కోట్ల జాతీయ క్వాంటం మిషన్ ద్వారా భారత్ ఈ రంగంలో అడుగులు వేస్తోంది; బెంగళూరులో కంప్యూటింగ్ హబ్ నడుస్తోంది. కానీ ఉన్నత శ్రేణి క్వాంటం హార్డ్‌వేర్ మాత్రం సొంతంగా లేదు. మన పరిశోధకులు విదేశీ యంత్రాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి. ఇది సెమీకండక్టర్ రంగంలో మనం చవిచూస్తున్న పరాధీనతను గుర్తుచేసే హెచ్చరిక. అదే సమయంలో, 'అల్గారిథంలు లేకుండా హార్డ్‌వేర్ నిరుపయోగం' అన్న రాయ్‌చౌధురి మాట మనకో దారి చూపుతోంది. హార్డ్‌వేర్ పోటీలో అమెరికా, చైనాలను వెంటనే అందుకోలేకపోయినా, మేధాశక్తే ముడిసరుకుగా ఉండే అల్గారిథంల రంగంలో భారత్ అగ్రస్థానం సాధించగలదని ఈ విజయం రుజువు చేసింది. అయితే అది జరగాలంటే మౌలిక పరిశోధనపై దృష్టి పెట్టాలి. ఔషధ ఆవిష్కరణ, పదార్థ విజ్ఞానం వంటి రంగాల్లో క్వాంటం అద్భుతాల గురించి మీడియా ఊదరగొడుతున్నా, గణనపరంగా అవి ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని ఆమె చెప్పిన మాట గమనార్హం. అంటే తక్షణ వాణిజ్య ఫలితాలు ఇవ్వని శుద్ధ శాస్త్రమే నేడు క్వాంటం ఆధిక్యపు తొలి పంటను పండించిందన్నమాట. వెంటనే లాభాలు చూపించమని పరిశోధకులను ఒత్తిడి చేసే ధోరణికి ఇది చెంపపెట్టు. అలాగే, ఒక మహిళా శాస్త్రవేత్త నాయకత్వంలో, గోవాలోని క్యాంపస్ నుంచి ఈ ఘనత రావడం.. శాస్త్ర పరిశోధన ఐఐటీలు, మహానగరాల గుత్త సొత్తు కాదని చాటుతోంది. ఇరవై సెకన్ల ఆ గణన, నిజానికి దశాబ్దాల తపస్సుకు దక్కిన ఫలం. ఆ తపస్సును ప్రోత్సహించి, సొంత హార్డ్‌వేర్ నిర్మాణం దిశగా జాతీయ క్వాంటం మిషన్‌ను వేగవంతం చేస్తే -రేపటి క్వాంటం యుగంలో భారత్ వినియోగదారుగా కాక, నిర్మాతగా నిలుస్తుంది. ఆ దిశగా ఈ 'ఇరవై సెకన్ల మెరుపు' ఒక శుభసంకేతం!.

## పనికొచ్చే పలుకు



## కాలేజీ కాదు.. కలలే మీ బ్రాండ్!

భారతదేశంలో సగటు మధ్యతరగతి ఇంజనీరింగ్ విద్యార్థి కల.. ఎలాగైనా ఐఐటీలో సీటు కొట్టడం. తర్వాత మంచి ప్యాకేజీతో ఉద్యోగంలో చేరడం! గ్లోబల్ టెక్నాలజీ కంపెనీల్లో స్థిరపడాలన్నా, భారీ ప్యాకేజీ అందుకోవాలన్నా ఐఐటీ ట్యాగ్ ఒక్కటే ఏకైక మార్గమని మెజారిటీ విద్యార్థులు నమ్ముతారు. అయితే, ప్రతిభకు ఏ కాలేజీ బ్రాండ్ అవసరం లేదని, పట్టుదల ఉంటే ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీని సైతం శాసించవచ్చని నిరూపించాడు కర్ణాటక కుర్రోడు పృథ్వీరాజ్. ఇటీవల ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో ప్రపంచాన్ని శాసిస్తున్న మైక్రోచిప్ దిగ్గజం 'ఎన్వీడియా'కు చెందిన కాలిఫోర్నియాలోని శాంటా క్లారా ప్రధాన కార్యాలయంలో పృథ్వీరాజ్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజనీర్ (డీప్ లెర్నింగ్)గా చేరాడు. అతని ప్యాకేజీ అక్షరాలా రూ.2.6కోట్లు! ఈ విషయాన్ని ఆయన స్వయంగా తన లింక్డ్ఇన్ ఖాతా ద్వారా పంచుకోవడంతో, ఈ విజయగాథ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. కేవలం ప్రీమియం ఇన్‌స్టిట్యూట్‌ల విద్యార్థులకే ఇలాంటి అవకాశాలు వస్తాయనే అపోహలను ఈ ప్రయాణం పూర్తిగా బద్దలు కొట్టింది.

పృథ్వీరాజ్ ప్రయాణం అంత సులువుగా సాగలేదు. కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాకు చెందిన 'కటందేవరకోట' ఆయన స్వస్థలం. కనీస సాంకేతిక వనరులు, ఆధునిక విద్యావకాశాలు లేని పల్లెటూరు నుంచి ఆయన తన ప్రయాణాన్ని ప్రారంభించాడు. తండ్రి ఒక సాధారణ బ్యాంక్ ఉద్యోగి. మధ్యతరగతి కుటుంబ నేపథ్యం కావడంతో ఎలాంటి అదనపు సదుపాయాలు లేవు. కేవలం సొంత శ్రమ, పట్టుదలనే పెట్టుబడిగా మార్చుకున్నాడు. బెంగళూరులోని పీఈఎస్ యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన పృథ్వీరాజ్, కాలేజీ క్యాంపస్ సెలక్షన్స్ లేదా థియరీ చదువులకే పరిమితం కాలేదు. భవిష్యత్తు అంతా కృత్రిమ మేధస్సు, డీప్ లెర్నింగ్ చుట్టూనే తిరగబోతోందని ముందుగానే గుర్తించి, ఆయా రంగాల్లో ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంచుకోవడంపై దృష్టి పెట్టాడు. సాంకేతికత అందుబాటులో లేని వాతావరణంలో పెరగడంవల్ల మొదట్లో ఈ కలలు అసాధ్యంగా అనిపించేవని, ప్రయాణంలో ఎన్నో అడ్డంకులు, సొంత సామర్థ్యంపై అనుమానాలు వ్యక్తమైనా ఏనాడూ వెనకడుగు వేయలేదని ఆయన గుర్తుచేసుకున్నాడు.

కోచింగ్‌లు లేవు.. సొంతంగానే ప్రయోగాల పాఠాలు

ఖరీదైన కోచింగ్ సెంటర్లు, బడా కాలేజీల రెప్యుటేషన్‌పై ఆధారపడకుండా, పృథ్వీరాజ్ ఆన్‌లైన్ కోర్సులు, సొంత ప్రాజెక్టులు, నిరంతర సాధన ద్వారా ఏఐ, డీప్ లెర్నింగ్ టెక్నాలజీలపై పట్టు సాధించాడు. డిగ్రీ పూర్తయిన తర్వాత ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. అక్కడ కూడా ఆయనకు ఏ పెద్ద యూనివర్సిటీలోనూ సీటు రాలేదు. ఒక సాధారణ టైర్-3 వర్సిటీలోనే మాస్టర్స్ చేశాడు. ఆ సమయంలో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ, కెరీర్ ప్లానింగ్ కోసం సరైన గైడెన్స్ లేకపోయినా ఒంటరిగానే పోరాడాడు.

అనంతరం ఎన్వీడియా సంస్థ నిర్వహించే అత్యంత కఠినమైన రిక్రూట్‌మెంట్ ప్రక్రియను తన అసాధారణ సాంకేతిక పరిజ్ఞానంతో సులువుగా ఛేదించాడు. ప్రస్తుతం అతను ఎన్వీడియాలో అత్యాధునిక డీప్ లెర్నింగ్ టెక్నాలజీలపై పనిచేస్తూ, ఏడాదికి దాదాపు 2,75,000 డాలర్లు (మన భారత కరెన్సీలో సుమారు రూ.2.6 కోట్లు) వేతనంగా అందుకుంటున్నాడు. ప్రపంచంలోని అత్యంత ప్రతిభావంతులైన మేధావులతో కలిసి పనిచేసే అవకాశం రావడం తన అదృష్టమని పృథ్వీరాజ్ పేర్కొన్నాడు. చివరగా తోటి విద్యార్థులకు ఆయన ఒకటే సందేశమిచ్చాడు. "కాలేజీల బ్రాండ్లకంటే మీ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవడంపైనే దృష్టి పెట్టండి. ఓపికగా ఉండండి. విజయం ఎంత దూరంలో ఉన్నా ప్రయత్నాన్ని మాత్రం ఆపకండి" అని.


# లోకేష్‌తో కొరియా కరచాలనం!



ఒక రాజకీయ నాయకుడి పనితీరుకు ప్రజలు బిరుదులివ్వడం సహజం. కానీ ఏడు సముద్రాల ఆవల, భాషా సంస్కృతులు పూర్తిగా భిన్నమైన దేశపు ప్రతినిధులు మన మంత్రికి ముద్దుపేరు పెట్టడం అరుదైన విశేషం! ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ వారంపాటు దక్షిణ కొరియా పర్యటనలో చూపిన చురుకుదనానికి ముగ్ధులైన కొరియన్ ప్రతినిధులు ఆయనకు 'పల్లి.. పల్లి మంత్రి' అని నామకరణం చేశారు. కొరియన్ భాషలో 'పల్లి పల్లి' అంటే 'త్వరగా.. త్వరగా' అని అర్థం. వేగమే జీవన విధానంగా, పనితనమే సంస్కృతిగా బతికే కొరియన్లనుంచి ఆ మాట రావడం సామాన్య ప్రశంస కాదు.. యువనేతకు అదొక ధ్రువీకరణ. జూలై 5నుంచి 11 వరకు సాగిన లోకేష్ అధికారిక పర్యటన ఎన్నో విధాలుగా ప్రత్యేకం. సాధారణంగా రాష్ట్ర మంత్రులు పెట్టుబడుల వేటకు తామే విదేశాలకు వెళుతుంటారు; కానీ ఇక్కడ దక్షిణ కొరియా విదేశాంగ మంత్రిత్వ శాఖే స్వయంగా లోకేష్‌ను అధికారికంగా ఆహ్వానించడం గమనార్హం. రాష్ట్రంతో ద్వైపాక్షిక, వాణిజ్య సహకారాన్ని బలోపేతం చేసుకోవాల్సిన ప్రాధాన్యతను ఆ దేశమే గుర్తించిందనడానికి ఇంతకుమించిన రుజువులు అక్కర్లేదు. సియోల్‌లో తెలుగు ప్రవాసులతో ఆత్మీయ సమావేశంతో మొదలైన యాత్ర, సీఐఐ ఆధ్వర్యంలో పెట్టుబడిదారుల రోడ్‌షోతో ముగిసేలోగా -50కి పైగా కార్పొరేట్ దిగ్గజాల నాయకత్వంతో ముఖాముఖి భేటీలు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో చర్చలు, పారిశ్రామిక క్షేత్రాల సందర్శనలతో సాగిపోయింది. ఎల్జీ వంటి అంతర్జాతీయ దిగ్గజం తన ప్రధాన కార్యాలయానికి ప్రత్యేకంగా ఆహ్వానించి, ఉన్నతస్థాయి బృందంతో గౌరవ విందు ఇవ్వడం మామూలు మర్యాద కాదు; అది ఆంధ్రప్రదేశ్ పట్ల కొరియన్ కార్పొరేట్ ప్రపంచంలో ఏర్పడుతున్న విశ్వాసానికి నిలువెత్తు సంకేతం! ఎల్జీ, హ్యుందయ్, శాంసంగ్, బీఎన్‌కే ఫైనాన్షియల్ వంటి సంస్థలు తమ అత్యున్నత నాయకత్వంతో సంప్రదించి ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇవ్వడంతో, ఈ వారం రోజుల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కే ఆశలు చిగురించాయి. వారం రోజుల అధికారిక పర్యటనను అక్షరాలా 'పెట్టుబడుల యాత్ర'గా మలిచిన లోకేష్ లౌక్యం వెనుక, రాష్ట్రాభివృద్ధిపై ఆయనకున్న చిత్తశుద్ధి, 20 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంపై నిబద్ధత సుస్పష్టం!

పర్యటనలో లోకేష్ అనుసరించిన వ్యూహం -సమగ్రం, బహుముఖం. తొలిరోజే భారత రాయబారి గౌరంగలాల్ దాస్‌తో భేటీ అయి, కొరియా ప్రాధాన్యతా రంగ పరిశ్రమలను ఏపీకి తీసుకొచ్చేందుకు చొరవ చూపాలని కోరుతూ రాష్ట్ర విజన్‌ను ఆవిష్కరించారు. దౌత్య మార్గాలను, వాణిజ్య మార్గాలను సమాంతరంగా నడిపిన ఈ పద్ధతి పరిణత రాజనీతికి అద్దంపట్టేదే! దక్షిణ కొరియా ప్రఖ్యాత ఓడరేవు నగరం బుసాన్‌లో ఏపీఈడీబీ ఆధ్వర్యంలో 'అపెక్స్-కొరియా' పేరిట పెట్టుబడిదారుల సహాయక, అనుసంధాన విభాగాన్ని ప్రారంభించడం.. యాత్రలో వ్యవస్థాగతంగా నిలిచిపోయే ముందడుగు. పర్యటనలు వస్తూ పోతుంటాయి గానీ, ఇలాంటి శాశ్వత యంత్రాంగాలే దీర్ఘకాల బంధాలకు పునాదులవుతాయి. కొరియన్ పెట్టుబడిదారులకూ ఏపీ ప్రభుత్వానికీ మధ్య ఇది ఏక గవాక్ష వారధిగా పనిచేయడంతోపాటు, శ్రీసిటీ పరిసరాల్లో ఇప్పటికే కార్యకలాపాలు సాగిస్తున్న 40కి పైగా కొరియన్ కంపెనీలకు 'ఆఫ్టర్ కేర్' భరోసానూ ఇస్తుంది. పెట్టుబడిని రాబట్టడం ఒక ఎత్తయితే, వచ్చిన పెట్టుబడిదారుడిని కంటికి రెప్పలా చూసుకోవడం మరో ఎత్తు. రెండోది బాగుంటేనే మొదటిది వెల్లువలా వస్తుందన్న మార్కెటింగ్ మౌలిక సూత్రాన్ని లోకేష్ ఒంటబట్టించుకున్నారని ఈ ఏర్పాటు చెప్పకనే చెబుతోంది. అనంతపురం జిల్లాలో అడుగుపెట్టిన రెండేళ్లలోనే ఉత్పత్తి ప్రారంభించి అద్భుత విజయం సాధించిన 'కియా' గాథను ఆయన ప్రతి వేదికపైనా ఉదహరించడం -పరిణితి సాధించిన రాజకీయ నేత ప్రదర్శించే గొప్ప ఎత్తుగడ! సొంత దేశపు కంపెనీ విజయంకంటే గొప్ప ప్రచారపత్రం మరొకటి ఉండదు కదా! దానికితోడు కూటమి ప్రభుత్వ 'త్రీ ఎస్' నమూనా -స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్.. పారదర్శక పాలన, వేగవంతమైన అనుమతులపై లోకేష్ ఇచ్చిన ప్రజెంటేషన్లకు కొరియా మీడియా, దిగ్గజ సంస్థలు ఫిదా అయ్యాయి. బుసాన్‌లో కొరియా మెరైన్ ఎక్విప్‌మెంట్ అసోసియేషన్ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో 1,053 కిలోమీటర్ల తీరరేఖ, ఏటా 33 కోట్ల టన్నులకు పైగా సరుకు రవాణా సామర్థ్యం, నాలుగు కొత్త గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, లక్ష ఎకరాలకు పైబడిన పారిశ్రామిక ల్యాండ్ బ్యాంక్‌వంటి బలాలను ప్రస్తావిస్తూ ఏపీని భారత సముద్ర వాణిజ్య ముఖద్వారంగా లోకేష్ ప్రతిపాదించడం.. విజనరీ చంద్రబాబుకు 2.0 వర్షన్ లోకేష్ అనిపించుకున్నారు. రూ.30 వేల కోట్ల అంచనాతో రూపుదిద్దుకుంటున్న దుగరాజపట్నం షిప్‌బిల్డింగ్ క్లస్టర్‌లో మెరైన్ ఇంజిన్లు, నావిగేషన్ పరికరాల తయారీకి కొరియన్ సంస్థలను ఆహ్వానించారు. అంతేకాదు.. ఏపీ-కొరియా ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో కొరియన్ భాషా కేంద్రాలు, కొరియన్ సాంస్కృతిక కేంద్రం, విశాఖ-బుసాన్ నగరాల మధ్య భాగస్వామ్యం, ప్రత్యక్ష విమాన అనుసంధానం వంటి దీర్ఘకాలిక ప్రతిపాదనలనూ ఆయన తెరపైకి తెచ్చారు. దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు.. ఇది పెట్టుబడుల వేటే కాదు; రెండు ప్రాంతాల మధ్య ఆర్థిక, సాంస్కృతిక, మానవ వనరుల వారధి నిర్మాణ ప్రయత్నమని!

విశాలమైన ఈ కృషికి కొరియా నుంచే ప్రశంసల జల్లు కురవడం పర్యటన సాఫల్యానికి తిరుగులేని నిదర్శనం. కోట్రా దక్షిణాసియా విభాగాధిపతి క్యుంగ్‌హూన్ కిమ్.. లోకేష్ బృందానికి 'హ్యాట్సాఫ్' అంటూ బహిరంగంగా అభినందనలు తెలపడం, ప్రతినిధులు 'పల్లి పల్లి మంత్రి' అంటూ ఆత్మీయంగా పిలుచుకోవడం -విదేశీ గడ్డపై తెలుగు రాష్ట్రానికి దక్కిన అత్యున్నత గౌరవం. అయితే ఈ విజయగాథను రాష్ట్ర రాజకీయ నేపథ్యంలో పెట్టి చూసినప్పుడే దీని విలువ పూర్తిగా బోధపడుతుంది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం ఆరోపణల రాజకీయాలు, కుట్ర సిద్ధాంతాలతో కాలక్షేపం చేస్తున్న వేళ, ఆ రొదను పట్టించుకోకుండా అభివృద్ధి బాటలో లోకేష్ పరుగులు తీస్తుండటం -యువతలో విశ్వాసం బలోపేతమవుతోంది. విమర్శలకు విమర్శలతో కాక, ఫలితాలతో జవాబివ్వడమే నిజమైన రాజనీతిగా ఈ తరం నాయకుడు నిరూపిస్తున్నాడన్న భావన ప్రజల్లో దేదీప్యమవుతోంది. ప్రపంచ సరఫరా గొలుసులు చైనానుంచి ప్రత్యామ్నాయ గమ్యస్థానాల వైపు చూస్తున్న చారిత్రక సంధి కాలంలో, స్థిరమైన విధానాలు, నైపుణ్య మానవ వనరులు, మౌలిక వసతులున్న ప్రాంతాలదే భవిష్యత్తు. ఆ అవకాశాన్ని ఒడిసిపట్టేందుకు ఏపీ సరైన సమయంలో సరైన తలుపులు తడుతోందని లోకేష్ కొరియా యాత్ర చాటింది. అలాగని గమ్యం చేరిపోయామని కాదు; హామీలు ఒప్పందాలుగా, ఒప్పందాలు ఫ్యాక్టరీలుగా, ఫ్యాక్టరీలు ఉద్యోగాలుగా మారినప్పుడే యాత్ర పరిపూర్ణ సార్థకత సంతరించుకున్నట్టు. అందుకు అనుసరణ (ఫాలో-అప్) యంత్రాంగం నిరంతరం పనిచేయాలి; అపెక్స్-కొరియా సెల్ కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పరిగెత్తాలి. వేగంతోపాటు నిలకడ కూడా తోడైనప్పుడే 'పల్లి పల్లి' ప్రశంస శాశ్వత కీర్తిగా మారుతుంది. దశాబ్దాల క్రితం 'హైటెక్ సీఎం'గా చంద్రబాబు అంతర్జాతీయ ఖ్యాతి గడించిన బాటలో, నేడు తనయుడు 'పల్లి పల్లి మంత్రి'గా గుర్తింపు తెచ్చుకోవడం -ఒక అభివృద్ధి వారసత్వపు కొనసాగింపు కాకపోదు. ఈ వేగం, ఈ దూరదృష్టి, ఈ నిబద్ధత ఇలాగే కొనసాగితే, స్వర్ణాంధ్ర స్వప్నానికి కొరియావంటి మిత్రదేశాలు బలమైన భాగస్వాములవడం రేపటి చరిత్ర కాకపోదు! ■



మన మనసులోని ప్రతికూల ఆలోచనలు ఎప్పుడూ పెద్దగా అరవవు. చాలా నిశ్శబ్దంగా, చిన్నగా భవిష్యత్తును వెనక్కిలాగే కథలు చెప్తాయి. 'రేపు ప్రారంభిద్దాం', 'నేనింకా సిద్ధంగా లేను', 'ఇది నాకు వర్కవుట్ కాదు' అంటూ పురోగతిని దెబ్బతీసే కథలవి. జీవితాన్ని శాసించే అవకాశం అలాంటి కథలకు ఇవ్వకండి. ఆ నిశ్శబ్ద గొంతును గుర్తించడమే మీ ఫస్ట్ సక్సెస్. 'రేపు' అనే మాటను 'ఇప్పుడే' అని మార్చిన క్షణంనుంచే -కలలు నిజమయ్యే ప్రయాణం మొదలైనట్టు. సాకులకు వెయ్యి దార్లు. సంకల్పానికి ఒకే దారి. కాని -ఆ ఒక్క దారే మనల్ని కలలుగన్న శిఖరానికి చేర్చేది. గెలుపు బయటెక్కడో లేదు -మీ లోపలి ఆ చిన్న గొంతును జయించడంలోనే ఉంది!

-మహాదేవ

## వింతల్లో వింతలు

## మనిషిని మించిన వేగం!!



సాలెపురుగు కనిపిస్తే హడలిపోయేవారికి ఒక్కటే ధైర్యం -పరిగెత్తి తప్పించుకోవచ్చునే! కానీ ఆ ఎనిమిది కాళ్ల జీవి మనకంటే వేగంగా పరిగెడితే? అదే పీడకల నిజమైంది. ప్రపంచంలోకెల్లా అత్యంత వేగవంతమైన సాలీడు ఏదో తేల్చేందుకు శాస్త్రవేత్తలు ఏకంగా 258 జాతులను ప్రయోగశాలలో పరీక్షించారు. ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్‌కు చెందిన 'హంట్స్‌మన్' సాలీడు సెకనుకు దాదాపు 3.6 మీటర్ల (గంటకు 13 కి.మీ.) వేగంతో దూసుకెళ్లి అగ్రస్థానం కైవసం చేసుకుంది. సగటు మనిషి నడక వేగం గంటకు 6-9 కి.మీ. మాత్రమే కావడంతో.. చాలామందిని ఇది సునాయాసంగా వెనక్కి నెడుతుంది! పొడవాటి కాళ్లున్న, కాస్త పెద్దగా ఉండే సాలీళ్లే వేగంగా పరిగెడతాయని, అయితే బరువెక్కిన పొట్ట మోయలేనంత పెద్దవైతే మాత్రం వేగం తగ్గుతుందని అధ్యయనం తేల్చింది. ఇక సాలీడు కనిపిస్తే పరుగు పనికిరాదన్నమాట!

# చెన్నై, ఫ్లెమింగ్ బంధానికి తెర



చెన్నై: చెన్నై సూపర్‌కింగ్స్ అనగానే ధోనీతో పాటు ఠక్కున గుర్తొచ్చే పేరు స్టీఫెన్ ఫ్లెమింగ్. ఫ్రాంఛైజీతో అతడి బంధం అంతగా పెనవేసుకుపోయింది. అతడి మార్గనిర్దేశనంలో ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందుకుంది సీఎస్కే. అయిదుసార్లు ఛాంపియన్ అయింది. ఇప్పుడు చెన్నైతో ఫ్లెమింగ్ సుదీర్ఘ ప్రయాణానికి తెరపడింది. ఆ ఫ్రాంఛైజీ ప్రధాన కోచ్‌గా అతడు వైదొలిగాడు. సుహృద్భావ వాతావరణంలో సీఎస్కే అతడితో విడిపోయింది. ఫ్లెమింగ్ 18 ఏళ్లు చెన్నై కోచ్‌గా విధులు నిర్వర్తించాడు. 2008లో అరంగేట్ర ఐపీఎల్‌లో చెన్నైకి ఆడిన అతడు.. 2009లో ఆ జట్టు కోచ్‌గా బాధ్యతలు అందుకున్నాడు. "క్రీడల్లో 18 ఏళ్లంటే జీవిత కాలం. నేను కృతజ్ఞతతో నిష్క్రమిస్తున్నా. నా కోచింగ్ కెరీర్‌లో చెన్నై సూపర్‌కింగ్స్‌తో నా కాలం నాకు లభించిన గొప్ప గౌరవం. మేం సాధించిన దాని పట్ల గర్విస్తున్నా. మేమంతా కలిసి చిరస్మరణీయ విజయాలను ఆస్వాదించాం. క్లిష్ట పరిస్థితులను అధిగమించాం. సీఎస్కే ఎప్పుడూ నా హృదయానికి చేరువగా ఉంటుంది. ముందు ముందర్నీ కూడా చెన్నైకి మద్దతుగా ఉంటా" అని సీఎస్కే విడుదల చేసిన ప్రకటనలో ఫ్లెమింగ్ చెప్పాడు.

# రో-కో కథ మారుస్తారా?

## ఇంగ్లాండ్‌తో భారత్ తొలి వన్డే నేడు

## మ. 3.30 నుంచి



బర్మింగ్‌హామ్: ప్రపంచ ఛాంపియన్‌గా యూకేలో అడుగుపెట్టిన టీమ్‌ఇండియాకు ఐర్లాండ్, ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌లు పెద్ద షాకే. అనూహ్యంగా తేలిపోయిన జట్టు.. వరుసగా ఆరు టీ20ల్లోనూ ఓడిపోయి విమర్శల పాలైంది. అన్ని విభాగాల్లోనూ అస్థిరత, ఫామ్ లేమి వెంటాడుతున్నాయి. ఇప్పుడిక టీమ్‌ఇండియాకు వన్డే పరీక్ష మొదలు కానుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇంగ్లాండ్‌తో మంగళవారమే తొలి పోరు. స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలకు తోడు కెప్టెన్ శుభ్‌మన్, సీనియర్ పేసర్ బుమ్రాలతో బలంగా కనిపిస్తున్న వన్డే జట్టు భిన్నమైన ఫలితం రాబడుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్‌లో ఆడాలనుకుంటున్న కోహ్లి, రోహిత్ ఈ సిరీస్‌లో సత్తా చాటాలనుకుంటున్నారు. రోహిత్‌తో కలిసి కెప్టెన్ గిల్ ఇన్నింగ్స్‌ను ఆరంభిస్తాడు. ఆ తర్వాత శ్రేయస్, రాహుల్, ఇషాన్ కిషన్ వస్తారు. దూబె, అక్షర్ పటేల్‌లలో ఒకరే జట్టులో ఉండొచ్చు. బుమ్రా రాక భారత బౌలింగ్‌ను బలోపేతం చేస్తుందనడంలో సందేహం లేదు. ప్రసిద్ధ్, అర్ష్‌దీప్‌లతో కలిసి అతడు పేస్ భారాన్ని పంచుకుంటాడు. ఏకైక స్పిన్నర్‌గా కుల్‌దీప్ యాదవ్ జట్టులో ఉండే అవకాశాలు మెండు. బర్మింగ్‌హామ్‌లో పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది. మ్యాచ్‌కు కాస్త వర్షం ముప్పుంది. హ్యారీ బ్రూక్ సారథ్యంలోని ఇంగ్లాండ్ వన్డే జట్టుకు డకెట్, బట్లర్, రూట్, బెతెల్, సామ్ కరన్, ఆర్చర్, టంగ్, సకిబ్ కీలకం.

# అక్కడే పడి.. అక్కడే లేచి



: స్టార్ పవర్ ఉన్నా.. ఇంగ్లాండ్ వేదికగా జరిగిన మహిళల టీ20 ప్రపంచకప్‌లో కనీసం సెమీఫైనల్ చేరలేకపోయింది హర్మన్‌ప్రీత్ బృందం. కొన్ని రోజుల వ్యవధిలోనే అదే ఇంగ్లిష్ గడ్డపై భారత్ చరిత్రాత్మక విజయాన్ని అందుకుంది. అయితే ఫార్మాట్ మారింది. ఇంగ్లాండ్‌తో ఏకైక టెస్టు మ్యాచ్‌లో అదిరే ప్రదర్శన చేసింది. క్రికెట్ పుట్టిల్లు లార్డ్స్ మైదానంలో ఆల్‌రౌండ్ షోతో ఆతిథ్య జట్టును చిత్తు చిత్తుగా ఓడించింది. టీ20 ప్రపంచకప్‌లో లీగ్ దశలోనే వెనుదిరిగి దిగాలు పడిన హర్మన్‌ప్రీత్ బృందం.. బలమైన ఇంగ్లాండ్‌ను, అందులోనూ వారి సొంతగడ్డపై ఓడించడం కచ్చితంగా విశేషమే. చరిత్రలో తొలిసారి మహిళల టెస్టుకు ఆతిథ్యం ఇచ్చిన లార్డ్స్‌లో భారత అమ్మాయిల ప్రదర్శన చిరస్మరణీయం. మిస్ డిపెండబుల్ స్మృతి మంధాన (83) తొలి ఇన్నింగ్స్‌లో ఆడిన ఆటే జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఆమే వేసిన పునాదిపైనే హర్మన్‌ప్రీత్, దీప్తి, జెమీమా ఇన్నింగ్స్‌ను నిర్మించి జట్టుకు మెరుగైన స్కోరు అందించారు. ఇక యువ పేసర్ క్రాంతి గౌడ్.. పిచ్‌ను ఇంగ్లాండ్ కంటే గొప్పగా ఉపయోగించుకుని దెబ్బ కొట్టింది. పదునైన పేస్‌తో 5 వికెట్లు తీసి తొలి ఇన్నింగ్స్‌లో ప్రత్యర్థినిని 200 లోపు స్కోరుకే పరిమితం చేసి విజయానికి బాటలు వేసింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ స్మృతి మంధాన (70) గట్టి పునాది వేస్తే.. యాస్తిక భాటియా (113) రికార్డు శతకంతో ఇన్నింగ్స్‌కు ఇరుసులా నిలిచింది. రిచా ఘోష్ (50 నాటౌట్) కూడా రాణించడంతో ఇంగ్లాండ్‌కు భారీ లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది టీమ్‌ఇండియా.

తొలి ఇన్నింగ్స్‌లో అయిదు వికెట్లు తీసిన క్రాంతి.. రెండో ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు కూల్చి ప్రత్యర్థిని దెబ్బ కొట్టింది. ఇక స్నేహ్ రాణా నాలుగు, సయాలి, దీప్తి చెరో రెండు వికెట్లు పడగొట్టి భారత్‌కు ఎప్పటికీ గుర్తుండిపోయే విజయాన్ని అందించారు. టీ20 ప్రపంచకప్ ప్రదర్శన తర్వాత జట్టు ప్రత్యర్థి గడ్డపై ఇంత సాధికారికంగా ఆడి గెలవడం అనూహ్యమే. ఈ విజయం రాబోయే సిరీస్‌ల్లో భారత్ మరింత ఆత్మవిశ్వాసంతో ఆడేందుకు ప్రేరణనిస్తుందనడంలో సందేహం లేదు.

# బాలీవుడ్ కంటే టాలీవుడ్‌కే సోనాలి బింద్రే ఫుల్ మార్క్స్

సాంప్రదాయక ఎత్నిక్ గ్లామర్‌కు నిలువుటద్దంలా నిలిచిన జాన్వీ కపూర్





బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఒక వెలుగు వెలిగినప్పటికీ, టాలీవుడ్ గురించి మాట్లాడాల్సి వస్తే తన అభిప్రాయం ఏమాత్రం దాచుకోనని నటి సోనాలి బింద్రే స్పష్టం చేశారు. రెండు పరిశ్రమల్లో పనిచేసిన అనుభవంతో ఆమె చేసిన తాజా కామెంట్స్ ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా టాలీవుడ్ పనితీరు, ప్లానింగ్, ప్రొడక్షన్ వాల్యూస్ పై ఆమె వ్యక్తం చేసిన అభిప్రాయాలు టాలీవుడ్ కు మరోసారి ప్రశంసలు తీసుకొచ్చాయి.టాలీవుడ్ లో పని చేసే విధానం చాలా క్రమబద్ధంగా ఉంటుందని, సినిమా ప్రారంభానికి ముందే కథ, స్క్రీన్‌ప్లే, షూటింగ్ ప్లాన్ వంటి అంశాలు క్లియర్ గా రెడీగా ఉండటం వల్ల షూటింగ్‌లు అనుకున్న టైమ్‌కే పూర్తవుతాయని ఆమె పేర్కొన్నారు. ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయడం వల్ల సెట్స్‌పై గందరగోళం తక్కువగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. అదే సమయంలో బాలీవుడ్ లో కొన్ని సందర్భాల్లో కథ లేదా సన్నివేశాల్లో చివరి నిమిషంలో మార్పులు చోటుచేసుకోవడం సాధారణమని, దీంతో షూటింగ్ షెడ్యూల్స్‌పై ప్రభావం పడుతుందని ఆమె వివరించారు. టాలీవుడ్‌లో మాత్రం ముందస్తు ప్రణాళికకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం నిర్మాతలు, డైరెక్టర్లు, నటీనటులందరికీ సౌకర్యంగా ఉంటుందని చెప్పారు.ప్రొడక్షన్ వాల్యూస్ విషయంలో కూడా తెలుగు సినిమాలు గత కొన్నేళ్లుగా భారీ స్థాయిలో అభివృద్ధి సాధించాయని సోనాలి అభిప్రాయపడ్డారు. కథకు తగ్గట్టుగా ఖర్చు పెట్టడంలో నిర్మాతలు వెనుకాడరని, టెక్నికల్ వాల్యూస్ కూడా అంతర్జాతీయ స్థాయికి చేరుకున్నాయని ఆమె పేర్కొన్నారు. సెట్స్‌లో కళాకారులు, టెక్నీషియన్ల పట్ల చూపించే గౌరవం, ఆతిథ్యం కూడా టాలీవుడ్ ప్రత్యేకతల్లో ఒకటిగా ఆమె చెప్పారు.తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న సోనాలి, తాను నటించిన సినిమాలే ఇప్పటికీ తనను తెలుగు అభిమానులకు దగ్గరగా ఉంచాయని అన్నారు. కెరీర్‌లో చేసిన క్యారెక్టర్ల ద్వారా లభించిన ఆదరణను ఎప్పటికీ మర్చిపోలేనని ఆమె పేర్కొన్నారు. గ్లామర్‌కే పరిమితం కాకుండా యాక్టింగ్ కు అవకాశం ఉన్న క్యారెక్టర్లు కూడా తెలుగు సినిమాల్లో దక్కడం తనకు ప్రత్యేక అనుభూతినిచ్చిందని తెలిపారు.పర్సనల్ లైఫ్ లో క్యాన్సర్‌తో పోరాడి సక్సెస్‌ఫుల్‌గా కోలుకున్న తర్వాత, ఇప్పుడు ఎంపిక చేసిన పాత్రలతోనే ప్రేక్షకుల ముందుకు వస్తున్న సోనాలి బింద్రే, మంచి కథ, బలమైన పాత్ర దొరికితే మరోసారి తెలుగు సినిమాలో నటించేందుకు సిద్ధమేనని సంకేతాలిచ్చారు. ఆమె కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, టాలీవుడ్ అభిమానులు ఆమె రీఎంట్రీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



అద్భుతమైన రోజ్-పింక్ లేస్ చీరలో రిద్ది కుమార్ అపురూపమైన హుందాతనం

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com